


# విజయభాను




విశాఖపట్నం, గురువారం 20-08-2020 VIJAYABHANU DAILY ★ VISAKHAPATNAM సంపుటి : 43 సంచిక : 297 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# వైఎస్సార్ ఆసరా పథకానికి కేబినెట్ ఆమోదం

- నాలుగేళ్లలో అక్కచెల్లెమ్మలకు రూ. 27,169 కోట్లు
- విద్యా కానుక కోసం రూ. 648.09 కోట్లు
- సెప్టెంబర్ 5న వైఎస్సార్ విద్యాకానుక పథకం
- సచివాలయంలో నిర్వహించిన కేబినెట్ సమావేశం



అమరావతి : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన బుధవారం సచివాలయంలో నిర్వహించిన కేబినెట్ సమావేశం ముగిసింది. ఈ కేబినెట్ బేటీలో సీఎం జగన్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఆసరా పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. నవరత్నాల్లో భాగంగా మరో హామీ అమలు చేసే దిశగానే వైఎస్సార్ ఆసరా పథకం ప్రారంభించనున్నారు. ఈ పథకం ద్వారా నాలుగేళ్లలో 27వేల కోట్లకుపైగా డ్వాక్రా మహిళలకు లబ్ధి చేకూరనుంది. దీంతో పాటు నూతన పారిశ్రామిక విధానానికి కూడా ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. కేబినెట్ బేటీలో తీసుకున్న నిర్ణయం ప్రకారం సెప్టెంబర్ 1న వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం, సెప్టెంబర్ 5న వైఎస్సార్ విద్యాకానుక పథకం, సెప్టెంబర్ 11న వైఎస్సార్ ఆసరా పథకాలకు ముహూర్తం ఖరారు చేశారు. దీంతో పాటు పంచాయతీరాజ్ శాఖలో 51 డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారుల పోస్టులకు కూడా కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ కేబినెట్ బేటీలో మంత్రులతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ.. జగనన్న విద్యా కానుక ద్వారా యూనిఫామ్‌లు, షూ, బెల్టు తదితర వస్తువులను 43 లక్షలకు పైగా విద్యార్థులకు అందజేస్తామన్నారు. ఇంటింటికి నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తున్నామని తెలిపారు. వైఎస్ఆర్ జిల్లా ఎలక్ట్రానిక్ పార్క్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైట్స్ సంస్థ ఇచ్చిన డీపీఆర్‌కు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ సీడ్ కంట్రోల్ చట్టాన్ని తీసుకొస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఏపీ కేబినెట్‌లో అపెక్స్ కౌన్సిల్‌పై కూడా చర్చించినట్లు తెలిపారు. వ్యవసాయ రంగానికి ఇప్పటివరకు రూ.26 వేల 872 కోట్ల రుణాలు అందించామని.. రూ.60 కోట్లతో టొబాకో రైతులను ఆదుకున్నామని మంత్రి నాని వెల్లడించారు.

**కేబినెట్ తీసుకున్న మరిన్ని నిర్ణయాలు**

- వైఎస్సార్ బీమా కింద సామాజిక భద్రతా పథకం ఈ పథకం 18-50 ఏళ్ల మధ్య వారికి వర్తిస్తుంది. సహజ మరణం పొందితే రూ.2లక్షల పరిహారం అందుతుంది. శాశ్వత వైకల్యం లేదా ప్రమాదవశాత్తూ మరణం సంభవిస్తే బాధిత కుటుంబాలకు రూ.5 లక్షలు, 18-50 ఏళ్ల మధ్య వర్తింపు శాశ్వత వైకల్యం లేదా ప్రమాదవశాత్తూ మరణం సంభవిస్తే బాధిత కుటుంబాలకు రూ.3 లక్షలు, 51-70 ఏళ్ల మధ్య వర్తింపు, రాష్ట్రంలో రేషన్ కార్డు ఉన్న సూమారు కోటి 50లక్షల మందికి ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం రూ.583.5 కోట్లు ఖర్చు చేయనుంది. - చిత్తూరు జిల్లా వెదురుకుప్పం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 26 టీచింగ్ పోస్టులు, 14 నాన్ టీచింగ్ పోస్టుల మంజూరుకు కేబినెట్ ఆమోదం - వైఎస్సార్ జిల్లా వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 27 టీచింగ్ పోస్టులు, 8 నాన్ టీచింగ్ పోస్టులు మంజూరుకు కేబినెట్ ఆమోదం, విశాఖ జిల్లా దిగువ సీలేరు జల విద్యుత్ కేంద్రంలో దాదాపు రూ.510 కోట్ల వ్యయంతో అదనంగా 2 యూనిట్లు ఏర్పాటుకు ఆమోదం, వైఎస్సార్ జిల్లా రాయచోటిలో కొత్త పోలీస్ సబ్

తరువాయి 2లో..

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలపై
# కేబినెట్ కీలక నిర్ణయం

### ఉద్యోగ నియామకాల కోసం ఎన్ఆర్ఏ ఏర్పాటు



దిల్లీ: రాబోయే రోజుల్లో కేంద్ర పరిధిలోని అన్ని ఉద్యోగాల నియామకానికి సంబంధించి ఒకే పరీక్ష నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి ప్రకాశ్ జావడేకర్ తెలిపారు. ఇందుకోసం నూతనంగా జాతీయ నియామక సంస్థ (ఎన్ఆర్ఏ)ను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. బుధవారం ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. దీని ద్వారా నిరుద్యోగులకు ఎంతో మేలు జరుగుతుందని, ఉద్యోగ నియామకం, ఎంపిక ప్రక్రియ మరింత సులభతరం కానుందని మంత్రి పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పరిధిలోని నాన్ గెజిటెడ్ ఉద్యోగాలు, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ఉద్యోగాల కోసం ఉమ్మడి పరీక్షను ఎన్ఆర్ఏ నిర్వహిస్తుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించి 20 సంస్థలు పనిచేస్తున్నాయి. ఇందులో మూడు సంస్థలు మాత్రమే ఉద్యోగ నియామకానికి సంబంధించి పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ప్రస్తుత నిర్ణయంతో అన్ని సంస్థలకు కలిపి ఒకటే పరీక్ష కామన్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీఈటీ)

# విషమంగానే ఎస్పీ బాలు ఆరోగ్యం



చెన్నై: కరోనాతో చికిత్స పొందుతున్న ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని చెన్నైలోని ఎంజీఎం ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. ఎస్పీ బాలుకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని.. నిపుణుల బృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని ఎంజీఎం వైద్యులు పేర్కొన్నారు. ఎస్పీబీ కరోనా నుంచి త్వరగా కోలుకోవాలని సినీ పరిశ్రమకు చెందిన వారితో పాటు సంగీతప్రియులూ ఆగస్టు 20న సామూహిక ప్రార్థనలు చేయాలని తమిళ సినీ పెద్దలు కోరారు. ప్రముఖ నటులు రజనీకాంత్, కమల్‌హాసన్, దర్శకుడు భారతీరాజా, సంగీత దర్శకులు ఇళయరాజా, ఏఆర్ రెహమాన్, రచయిత వైరముత్తు కలిసి ఓ ప్రకటన విడుదల చేశారు.

# నేవీ సన్నద్ధతపై పూర్తి నమ్మకం ఉన్నది

### - రాజ్‌నాథ్ సింగ్



న్యూఢిల్లీ: భారత నౌకాదళ సన్నద్ధతపై తనకు పూర్తి నమ్మకం ఉన్నదని కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఢిల్లీలోని నేవీ ప్రధాన కార్యాలయంలో బుధవారం ప్రారంభమైన నావల్ కమాండర్ల సమావేశానికి ఆయన హాజరయ్యారు. దేశ ప్రాదేశిక జలాల రక్షణలో భారత నౌకాదళం పోషిస్తున్న పాత్రను ఆయన అభినందించారు. ఎటువైపు నుంచి ఎలాంటి సవాళ్లు ఎదురైనా తక్షణం స్పందించేలా పూర్తి సన్నద్ధతతో నేవీ ఉన్నదన్న విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ దిశగా యుద్ధ నౌకలు, విమానాలను

తరువాయి 2లో..

# సచివాలయ ఉద్యోగుల నియామక పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

### జిల్లా కలెక్టరు వి. వినయ్‌చంద్



విశాఖపట్నం : ఆగస్టు 19 సెప్టెంబరు 20వ తేదీన నిర్వహించనున్న సచివాలయ ఉద్యోగుల నియామక పరీక్షలకు పక్కా ఏర్పాట్లు చేస్తామని జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్ తెలిపారు. బుధవారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో విశాఖపట్నం నుండి ఆయన పాల్గొన్నారు. అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. జిల్లాలో క్లష్టర్ లు అందరికీ అనుకూలంగా వుండే విధంగా పునర్ వ్యవస్థీకరిస్తామని చెప్పారు. కరోనా నేపద్యంలో తగిన జాగ్రత్తలను సుకుంటామని, నిబంధనల ననుసరిస్తూ పాజిటివ్ , లక్షణాలు వున్న అభ్యర్థులకు ప్రత్యేక గదులు కేటాయించడం జరుగుతుందన్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో

తరువాయి 2లో..



# రూ.2.5 లక్షల ఖర్చుతో మోడల్ హౌస్

### మోడల్ హౌస్‌ను పరిశీలించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



తాడేపల్లి: వైఎస్సార్ హౌసింగ్ స్కీమ్ కింద నిర్మించిన మోడల్ హౌస్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. తాడేపల్లి బోట్ హౌస్ వద్ద గృహ నిర్మాణ శాఖ మోడల్ హౌస్‌ను నిర్మించింది.

సెంటు స్థలంలో తక్కువ ఖర్చుతో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా సౌకర్యవంతంగా నిర్మాణం చేసింది. 40 గజాల విస్తీర్ణంలో హాల్, బెడ్‌రూమ్, కిచెన్, వరండాలతో కూడిన ఈ నిర్మాణానికి

తరువాయి 2లో..

## ఫోన్ ట్యాపింగ్‌పై
# ఆధారాలు ఉంటే ఇవ్వాలి

### పర్యాటక శాఖ మంత్రి అవంతి శ్రీనివాస్



విజయవాడ : ఫోన్ ట్యాపింగ్ పేరుతో చంద్రబాబు కొత్త కుట్రకోణానికి తెరలేపారని అవంతి శ్రీనివాస్ విమర్శించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం జగన్ కొత్త పథకం పెట్టినప్పుడల్లా కొత్త ఆరోపణతో ప్రజల దృష్టిని మళ్లించేందుకు పన్నాగం పన్నుతున్నారని మండిపడ్డారు. పథకాలకు వస్తున్న ఆదరణతో తమకు పుట్టగతులుండవన్న నిరాశతో చంద్రబాబు ఉన్నారని, అభద్రతాభావంతో మంచి పనులకు అడ్డుతగులుతూ అభాసుపాలవుతున్నారని ఎద్దేవా చేశారు. 'జేబు మీడియాను అడ్డుపెట్టుకొని అసత్య ఆరోపణలతో ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై ఆధారాలు ఉంటే ఇవ్వమని డీజీపీ కోరినా ఎందుకు ఇవ్వలేదు దుర్మార్గుడని తిట్టిన నోటితోనే ప్రధాని మోదీని ఇప్పుడు చంద్రబాబు పొగుడుతున్నారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రకం చంద్రబాబు. అన్నిప్రాంతాలు ఓట్లేస్తేనే మూడుసార్లు ముఖ్యమంత్రి అయ్యానని చంద్రబాబు మర్చిపోయారు. ఒక ప్రాంతానికి, ఒక వర్గానికే పరిమితమయ్యి తన స్థాయిని తగ్గించుకున్నారు. సొంతంగా ఆలోచించినంతకాలం



## ఫోన్ ట్యాపింగ్‌లో రాష్ట్ర ప్రభుత్వమే ముద్దాయి: యనమల

అమరావతి: శాసనమండలిలో ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ.. ప్రధానమంత్రికి చంద్రబాబు లేఖ రాస్తే హోం మంత్రి డీజీపీ.. భుజాలు తడుముకోవడమేంటని ప్రశ్నించారు. ''ఏపీలో ఫోన్ ట్యాపింగ్‌లలో సుప్రీంకోర్టు పేర్కొన్న హేతుబద్ధ కారణాలు ఉన్నాయా?. ఆర్టికల్ 19, 21 ప్రకారం ఇది రాజ్యాంగ, కేంద్ర చట్టాల ఉల్లంఘనే. ఏపీలో ఫోన్ ట్యాపింగ్ పౌర హక్కులను, ప్రాథమిక హక్కులను కాలరాయడమే. ప్రధాని స్పందించే వరకు డీజీపీ, హోం మంత్రి ఎందుకు ఆగలేక పోయారు?. వాదనలు వినిపించే న్యాయవాదుల ఫోన్ ట్యాపింగ్ చేయడం కన్నా తీవ్ర నేరం మరొకటి లేదు. ఏకారణంతో అడ్వొకేట్లు, జడ్జిల ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారు. ట్యాపింగ్‌పై సర్వీస్ ప్రొవైడర్లకు ఏమైనా లిఖిత పూర్వక ఆదేశాలు అందజేశారా? ఫోన్ ట్యాపింగ్ లో రాష్ట్ర ప్రభుత్వమే ముద్దాయి. ముద్దాయే సాక్ష్యాలు ఇవ్వాలని అడగటం ఎక్కడైనా ఉందా?'' అని యనమల ప్రశ్నించారు.



*వినాయక చవితి పండగ సందర్భంగా మూడు రోజులు ముందుగా. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 35వ వార్డు వాణిజ్య విభాగ ప్రెసిడెంట్ నోట్ల రమణకి (పెద్ద రమణ) వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 35వవార్డు అధ్యక్షులు, కార్పొరేటర్ అభ్యర్థి అలుపన కనకరెడ్డి నెలకు సరిపడే, రెండు బియ్యం బస్తాలు, రేషన్ ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో వార్డు ప్రధాన కార్యదర్శి, ఎ.ఆది విష్ణురెడ్డి, సౌత్, సేవ దళ ప్రెసిడెంట్, సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.*

## జూమ్ యాప్ ద్వారా బాబు ముఖాముఖి



మధురవాడ : మహా విశాఖ జూమ్ యాప్ ద్వారా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు స్థానిక మధురవాడ నేతలతో ముఖా ముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో దుర్మాగపు పాలనా ద్వారా టీడీపీ నేతలను టార్గెట్ చేస్తూ వారి పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని అటువంటి వాటికీ భయపడకుండా కార్యాకర్తలు నాయకులూ ప్రజలకు అందుబాటులో వుంటూ వారి సమస్యలను పరిష్కరించేలా కృషి చెయ్యాలని పలు సూచనలు చేసారు. అనంతరం 6 వ వార్డ్ టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీను మాట్లాడుతూ తమ పై ఎవరు ఎలాంటి అక్రమ కేసులు పెట్టిన బయపడమని ప్రతి క్షణం ప్రజల పక్షాన నిలబడి వారికి అండగా ఉంటామని అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. ప్రజల కోసమే పని చేస్తామని పేర్కొన్నారు. ఈ వీడియో సమావేశం ద్వారా సుమారు 15 మంది భీమిలి నియోజకవర్గ నాయకులూ పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి

## వైఎస్సార్ ఆసరా పథకానికి కేబినెట్ ఆమోదం

డివిజన్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం.పులివెందుల సబ్‌డివిజన్ నుంచి రాయచోటి శివారు గ్రామాలు 120 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పాటు రాయచోటి జనాభా పెరిగిన నేపథ్యంలో ఈ కొత్త సబ్‌డివిజన్ ఏర్పాటుకు నిర్ణయం.

రాయచోటిలో కొత్త ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటుకూ ఆమోదం. వై.ఎస్సార్ జిల్లాకు కొత్తగా 76 హోంగార్డు పోస్టులు మంజూరుకు మంత్రిమండలి ఆమోదం, నూతన పారిశ్రామిక విధానం 2020-23 కేబినెట్ ఆమోదం, రాష్ట్రంలో తూర్పుగోదావరి జిల్లాలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం, 2000 ఎకరాల్లో ఏర్పాటు కానున్న బల్క్ డ్రగ్ పార్క్, బల్క్ డ్రగ్ పార్క్ ద్వారా రానున్న ఎనిమిదేళ్లలో రూ.46,400 కోట్లు అమ్మకాలు జరుగుతాయని అంచనా, దాదాపు రూ.6940 కోట్లు పెట్టుబడులు వస్తాయని అంచనా ఏపీఐఐసీ కి అనుబంధంగా ఆంధ్రప్రదేశ్ బల్క్ డ్రగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్(ఏపీబీడీఐసీ) ఏర్పాటు వైఎస్సార్ జిల్లా కొప్పర్తిలో ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్ ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకరించిన మంత్రిమండలి, రూ.10వేల కోట్లు పెట్టుబడులు వస్తాయని, 1 లక్ష మందికి ఉపాధి కలుగుతుందని అంచనా క్లస్టర్ల మౌలిక సదుపాయాల కోసం దాదాపు రూ.730 కోట్లు ఖర్చు ఎలక్ట్రానిక్ రంగంలో కీలక పరిశ్రమలు ఆకట్టుకోవడమే లక్ష్యంగా అడుగులు భావనపాడు పోర్టు కోసం రైట్స్ కంపెనీ డీపీఆర్‌కు కేబినెట్ ఆమోదం, ఫేజ్ -1 కే దాదాపు రూ. 3669.95 కోట్లు ఖర్చు

శ్రీకాకుళం జిల్లా రూపురేఖలు మార్చనున్న పోర్టు, ఉత్తరాంధ్రలో మరో కీలక ప్రాజెక్టు తొలి దశలో భాగంగా 2024-25 నాటికి 12.18 ఎంటీపీఏ కార్గోను హేండిలింగ్ చేయాలన్న లక్ష్యం, 2039-40 నాటికి 67.91 ఎంటీపీఏ కార్గో హేండలింగ్ లక్ష్యం, ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ సీడ్( క్వాలిటీ కంట్రోల్ ) యాక్టు-2006 సవరణలపై ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం.

## కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలపై కేబినెట్ కీలక నిర్ణయం

నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారు మూడేళ్ల పాటు వివిధ ప్రభుత్వ రంగ సంస్థలకు చెందిన ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు.సీఈటీని ఆన్‌లైన్‌లో నిర్వహిస్తారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ), రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ), ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ సర్వీస్ పర్సనల్ (ఐబీపీఎస్) కోసం సీఈటీ తొలి దశ పరీక్షలు నిర్వహిస్తుంది. సీఈటీని డిగ్రీ, పన్నెండు, పది తరగతులు ఉత్తీర్ణులైన వారు దేశంలో ఎక్కడి నుంచైనా రాయవచ్చు. దేశవ్యాప్తంగా 117 జిల్లాల్లో ఈ పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు కేంద్రం తెలిపింది. ఉద్యోగ నియామకాల్లో పారదర్శకతకు పెద్ద పీట వేస్తూ తీసుకొచ్చిన ఎన్ఆర్ఏ యువ ఉద్యోగార్థులకు వరంగా మారనుందని ప్రధాని మోదీ అన్నారు. అలానే సీఈటీ ద్వారా పలు రకాల పరీక్షలు రద్దవడంతో పాటు విలువైన సమయం, వనరులు ఆదా అవుతాయని ప్రధాని వెల్లడించారు. ప్రస్తుత విధివిదానాల ప్రకారమే రిజర్వేషన్లు అమలవుతాయని మంత్రి తెలిపారు.

అలానే ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) కింద జైపుర్, గువాహటి, తిరువనంతపురం విమానాశ్రయాలను లీజుకు ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దీని ద్వారా ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు (ఏఏఐ)కు రూ.1,070 కోట్లు సమకూరనున్నాయని జావడేకర్ తెలిపారు.

## భారతదేశ సర్వ సంపదలు విదేశాలకు దానం చేయొద్దు మోడీ!

*- ప్రజలకు తిండి పెట్టండి - వైద్యం చేయండి - ఉపాధి కల్పించండి*

*- ఆగస్టు 20 నుండి 26 వరకు ఆందోళనలను జయప్రదం చేయండి*



విశాఖపట్నం : కరోనా సమయంలో మోడీ ప్రభుత్వం ప్రజలు, కార్మికులు, రైతులు హక్కులపై చేస్తున్న దాడిని, దేశ సర్వ సంపదలు విదేశాలకు అప్పజెప్పి దేశ ద్రోహానికి తలపడుతున్న దుష్ట పన్నాగాన్ని తిప్పికొట్టాలి. తక్షణం ప్రజలకు ఉపాధి కల్పించండి. తిండి పెట్టండి. వైద్యం చేయండి. మోడీ ప్రభుత్వంపై ఒత్తిడి కొసం ఆగస్ట్ 20 నుండి 26 వరకు సిపిఎం పార్టీ దేశవ్యాప్త ఆందోళనకు ఇచ్చిన పిలుపులో భాగంగా సచివాలయాలవద్ద జరుగు నిరసన కార్యక్రమాలలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని సిపిఐ(ఎం) గ్రేటర్ విశాఖ నగర కమిటీ విజ్ఞప్తి చేస్తుంది.

కరోనా కేసుల్లో అమెరికా, బ్రెజిల్ తరువాత భారత్ మూడో స్థానంలో ఉంది. 20 లక్షలు దాటినది.కరోనా విలయంలో ప్రజలు విలవిల్లాడుతున్నారు.

కానీ మోడీ మిత్ర బృందానికి ఇదేమీ పట్టడం లేదు. జనం చచ్చినా పట్టించుకోవడం లేదు. జన రక్షణకు ఆసుపత్రులు నిర్మించడానికి బదులు ఆలయ నిర్మాణానికి పునాదులు వేస్తున్నారు.

ప్రజలకు పనులు లేవు. తిండి లేదు. లాక్‌డౌన్‌తో ఆదాయాలు లేక ప్రజలు అష్టకష్టాలు పడుతుంటే ప్రజలను ఆదుకోవడం ఎలా అని ఆలోచించకుండా వరుసగా 20 రోజులు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి అన్ని ధరల పెరుగుదలకు మోడీ ఆజ్యం పోశాడు. క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గగా మోడీ ప్రజలపై దుష్ట దాడి ఇది. సరైన వైద్యం లేదు. వైద్య సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాలు లేవు. రాష్ట్రాలకు సహకారం లేదు.ఉచిత సలహాలు, ఊక దంపుడు ఉపన్యాసాలే. ప్రధాని పేర ట్రస్టు ఏర్పాటు చేసి వచ్చిన డబ్బంతా అక్రమ మార్గాన బిజెపి కుతంత్రాలకు వాడుకుంటున్నది.

ప్రతీ కుటుంబానికి నెలకు రూ.7500/- ఆర్థిక సహకారం ఆరు నెలలు అందించాలని, ప్రతి వ్యక్తికి నెలకు 10కేజీల బియ్యం ఇతర నిత్యావసర సరుకులు ఇవ్వాలని, పట్టణాలకు వర్తించేలా ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని, నిరుద్యోగ భృతి నిరుద్యోగ యువతీ యువకులకు ఇవ్వాలని, అంతర్ రాష్ట్ర వలస కార్మిక చట్టాన్ని రద్దు చేయొద్దని, చట్టాన్ని బలోపేతం చేయాలని, ప్రజారోగ్యంపై కేంద్ర ప్రభుత్వం జి.డి.పిలో 3% ఖర్చు పెంచాలని, కార్మిక చట్టాలకు చేసిన సవరణలు, చట్టాల రద్దు, చట్టాలను సస్పెండ్ చేసినవన్నీ రద్దుచేయాలని, ప్రభుత్వరంగ రైల్, విద్యుత్, బొగ్గు, పెట్రోలియం, బ్యాంకులు, ఇన్సూరెన్స్ ప్రైవేటీకరణ రద్దు చేయాలని, జాతీయ విపత్తు చట్ట ప్రకారం కోవిడ్ 19 బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఆగస్టు 20 నుండి 26వరకు నగరంలో ఉన్నా అన్ని సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలలో పాల్గొవాలని కోరుచున్నాం.

### పగిలిన మంచినీటి పైప్‌లైనుకు మరమ్మత్తులు...

## పరిష్కారమైన మంచినీటి సమస్య



ములగాడ: 62 వ వార్డు పరిధి మల్కాపురం ఎస్.సి కాలనీలో నీరు సరఫరా అయ్యే ప్రధాన పైపులైను పగిలి మంచినీటి సరఫరాకు అంతరాయం జరిగింది. గత నెల రోజులుగా మంచి నీరు వృధా అవుతుండటంతో ఈ సమస్య పై స్థానికులు సంబంధిత అధికారులకు పలు మార్లు తెలియజేసిన ఫలితం లేకపోవడంతో, ఈ సమస్యను బహుజన సమాజ్ పార్టీ 62 వ వార్డు కార్పొరేటర్ అభ్యర్థి అనపర్తి సైదా సుదర్శన్ దృష్టికి స్థానికులు తీసుకెళ్ళారు. వెంటనే సైదా సుదర్శన్ స్పందించి జి.వి.యం.సి నీటి సరఫరా విభాగ అధికారులను కలసి ఈ సమస్య పై చర్చించి వెంటనే పరిష్కరించాలని కోరగా వెంటనే అధికారులు స్పందించి తమ సిబ్బందితో పాడైపోయిన పైపులైను ను పునరుదించి మంచి నీటిని యధాతథంగా సరఫరా అయ్యేటట్లు పని చేశారు. దీనితో స్థానిక ప్రజలు సుదర్శన్ కు అభినందనలు తెలియజేసారు.

## సచివాలయ ఉద్యోగుల నియామక పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించే పరీక్షలను ఒక సవాల్‌గా తీసుకోవలసిన అవసరం వుందని జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. బుధవారం తాడేపల్లిలోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగాల భర్తీకి నిర్వహించే పరీక్షలపై అన్ని జిల్లా కలెక్టర్లతో మంత్రి, పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, పీఆర్ కమిషనర్ గిరిజా శంకర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. విశాఖపట్నం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరు తో పాటు జివియంసి కమిషనర్ డా.జి.సృజన, జిల్లా పరిషత్ సి.ఈ.వో. నాగార్జున సాగర్, జిల్లా పంచాయితీ అధికారి కె.కృష్ణకుమారి, డి.ఆర్.ఒ. ఎ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ టాపింగ్‌పై ఆధారాలు ఉంటే ఇవ్వాలి

చంద్రబాబు రాజకీయం బాగుండేది. కొడుకు లోకేష్ ఆలోచనలతో పనిచేసి 23 సీట్లకు పార్టీ స్థాయిని దిగజార్చారు. లోకేష్ మాటలు వినటం మానకుంటే ఆ సంఖ్య మూడుకు పడిపోవటం ఖాయం' అని అన్నారు. బాపు మ్యూజియంలో 11 కోట్లతో జరుగుతున్న పనులను బుధవారం మంత్రి అవంతి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'బాపు మ్యూజియంలో శిలా సంపద చాలా ఉంది. అత్యంత అరుదుగా దొరికే ప్రాచీన వస్తువులను మనం ఇక్కడ చూడొచ్చు. పూర్వీకులు మనకిచ్చిన సంపద మన సంస్కృతి సంప్రదాయాలు. మన భవిష్యత్ తరాల వారికి ఈ ప్రాచీన సంపదను అందించాలి. మ్యూజియంను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నాం. త్వరలోనే ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి ఆయన చేతుల మీదుగా ప్రారంభిస్తాం. విజయవాడ వస్తే ప్రతిఒక్కరూ బాపు మ్యూజియంను సందర్శించేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం' అని తెలిపారు.


## నేవీ సన్నద్ధతపై పూర్తి నమ్మకం ఉన్నది

మోహరించడాన్ని ప్రశంసించారు. సున్నితమైన ప్రదేశాల్లో యుద్ధ నౌకలు, విమానాలను మోహరించడం ద్వారా దేశ సముద్ర ప్రయోజనాలను పరిరక్షించడానికి భారత నావికాదళం మిషన్ ఆధారిత విస్తరణను సమర్థవంతంగా నిర్వహిస్తున్నదని రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. ప్రాదేశిక జలాలపై అవగాహనతోపాటు వేగవంతమైన మానవతా సహాయం అందించడానికి ఈ చర్యలు దోహదపడతాయని ఆయన చెప్పారు.

కాగా, నేవీ కమాండర్ల సమావేశం మూడు రోజులపాటు జరుగనున్నది. సరిహద్దులో చైనాతో ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో ఈ నేవీ కమాండర్ల సమావేశం జరుగనుంటడం ప్రాధాన్యత సంతరించుకున్నది. గత నెలలో జరిగిన ఎయిర్ కమాండర్ల సమావేశానికి కూడా కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హాజరయ్యారు.

# ఆదివారం శ్రీకాకుళంలో లాక్‌డౌన్

### నిత్యావసరాలు ముందుగానే నిల్వ చేసుకోవాలని పిలుపునిచ్చిన కలెక్టర్



శ్రీకాకుళం : శ్రీకాకుళం పట్టణంలో ఆదివారం పూర్తిస్థాయిలో లాక్ డౌన్ అమల్లో ఉంటుందని జిల్లా కలెక్టర్ జె నివాస్ తెలిపారు. కాయగూరల మార్కెట్లు, చికెన్, మటన్, చేపల మార్కెట్లు కూడా తెరవడం జరగదని ఆయన స్పష్టం చేసారు. బుధవారం జిల్లా ప్రజలను ఉద్దేశించి జిల్లా కలెక్టర్ ఒక వీడియో సందేశాన్ని విడుదల చేస్తూ శ్రీకాకుళం పట్టణంలో కేసులు అధికంగా పెరుగుతున్నాయని అన్నారు. వైరస్ వ్యాప్తికి గురికాకుండా ప్రజలు దూరంగా ఉండాలని ఆయన కోరారు. శ్రీకాకుళం పట్టణంలో 2,400 కేసులు నమోదు కాగా 13 వందల ఏక్టివ్ కేసులు ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆదివారం పూర్తి స్థాయిలో లాక్ డౌన్ అమలు చేస్తున్నామని చెప్పారు. లాక్ డౌన్ కు మొదటి నుంచి ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని, అదే విధంగా జిల్లాలో ముఖ్యంగా శ్రీకాకుళం పట్టణంలో వైరస్ వ్యాప్తిని నివారణకు ఆదివారం లాక్ డౌన్ కు సహకరించి వైరస్ వ్యాప్తి నివారణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలు ముందుగానే ఇంటి అవసరాలకు నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి నిల్వ చేసుకోవాలని సూచించారు. మందుల దుకాణాలు లభ్యంగా ఉంటాయని, వాటితోపాటు వాటికి ఆనుకుని పాలు, బ్రెడ్ మాత్రం మధ్యాహ్నం ఒంటి గంట వరకు అందుబాటులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. అత్యవసర వైద్య సేవలను వినియోగించుకొనుటకు ఎటువంటి ఆటంకం లేదని ఆయన స్పష్టం చేసారు. అంబులైన్సులు, వైద్య వాహనాలకు అనుమతి ఉందని పేర్కొంటూ అత్యవసర పరిస్థితుల్లో సొంత వాహనాల్లో వైద్యం నిమిత్తం వెళ్ళే వాహనాలకు కూడా ఆటంకం ఉండదని ఆయన తెలిపారు. అయితే అత్యవసరం కానప్పటికి వైద్య సేవలు పొందే నెపంతో బయట తిరిగే వాహనాలు, యజమానులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ అన్నారు. ప్రతి ఒక్కరూ మాస్కుతోపాటు ఫేష్ షీల్డ్ ధరించాలని కోరారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఫేష్ షీల్డులను కొంత మందికి ఉచితంగా పంపిణీ చేయుటకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ అన్నారు. వ్యక్తుల మధ్య భౌతిక దూరం పాటించాలని, చేతులను తరచూ శుభ్రపరచుకోవాలని ఆయన అన్నారు. డ్రగ్స్ అసోసియేషన్ సౌజన్యంతో మందుల దుకాణాల వద్ద ఆక్సిజన్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ప్రజలు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుని ఆక్సిజన్ స్థాయిని పరీక్షించుకోవాలని కలెక్టర్ కోరారు.

ఆసుపత్రులు పెంపు : కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టుటలోనూ, వైరస్ భారీన పడిన వారికి చికిత్సను అందించడంలో జిల్లాలో పెద్ద ఎత్తున చర్యలు చేపట్టామని కలెక్టర్ అన్నారు. నాలుగు ప్రైవేట్ ఆస్పత్రుల్లో కరోనా చికిత్స ప్రారంభించడం జరిగిందని అన్నారు. మరిన్ని ఆసుపత్రుల్లో కరోనా చికిత్స అందించుటకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. రాజాం, టెక్కలి, పలాస వంటి ప్రాంతాల్లో సైతం కరోనా చికిత్సను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు ఆయన వివరించారు. కరోనా లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రిలో చేరాలని ఆయన సూచించారు. ఆయాసం, 94 శాతం కంటే తక్కువ స్థాయిలో ఆక్సిజన్, మూడు రోజుల పాటు జ్వరం ఉంటే వెంటనే ఆసుపత్రిలో చేరాలని అన్నారు. అటువంటి వారు కరోనా పరీక్షలతో నిమిత్తం లేకుండా ఆసుపత్రుల్లో చేరాలని కోరారు. ప్లాస్మా దాతలు రియల్ హీరోలు : కరోనా భారిన పడి కోలుకున్న వ్యక్తులు ప్లాస్మా దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనేక మంది ప్రాణాలు కాపాడిన రియల్ హీరోలు కాగలరని కలెక్టర్ అన్నారు. ఇప్పటికే కొంత మంది ప్మాస్మా దానం చేసి స్ఫూర్తిప్రదంగా నిలిచారని కొనియాడారు. ప్లాస్మా దానం చేసే వారికి రూ.5 వేల ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించాలని ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశించారని చెప్పారు.

**సామూహిక పూజలు వద్దు ఇంటి వద్దే ముద్దు** : వినాయక చవితి పండగను ఇంటి వద్దనే చేసుకోవాలని కలెక్టర్ నివాస్ కోరారు. సామూహిక పూజల వద్దని, తద్వారా వైరస్ వ్యాప్తికి అవకాశం ఉంటుందని చెప్పారు. వినాయక మండపాలు ఎక్కడా పెట్టరాదని ఆయన స్పష్టం చేసారు. బహిరంగ ప్రదేశాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేసి మూకుమ్మడి వేడుకలు చేసుకోరాదని అన్నారు. కుటుంబ శ్రేయస్సు దృష్ట్యా ఇంటిలోనే పూజలు నిర్వహించి భగవంతుని ఆశీస్సులు పొందాలని కోరారు. మార్కెట్లలోమీ, వీధుల్లోను వినాయక మండపాలు వద్దని, ఆదేశాలను ధిక్కరించే వారిపై కఠిన చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## రూ.2.5 లక్షల ఖర్చుతో మోడల్ హౌస్



2లక్షల 50వేల రూపాయలు ఖర్చు అయింది. అత్యంత తక్కువ ఖర్చుతో ఇంటి నిర్మాణం పూర్తయినట్లు అధికారులు తెలిపారు. కాగా రాష్ట్రంలో పేదలందరికీ సొంతింటి కలను నిజం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించిన విషయం తెలిసిందే.





# అమ్మ చేతి వంట తింటూ ఎంచక్కా ఇంటి నుంచే ఉద్యోగం

సాగర్‌నగర్ : ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారి నవతరం ఉద్యోగులకు మాత్రం ఓ కొత్త అనుభూతికి కారణంగా నిలిచింది. ఇంటివద్దే ఉంటూ అమ్మచేతి వంటను మిస్సవకుండా ఎక్కడో అమెరికాలో ఉన్న ఐటి కంపెనీలకు వర్క్ ఫ్రమ్ హోమ్ (ఇంటి నుంచే పని ) గా సేవలందిస్తూ ఇంజనీరింగ్ పూర్తి చేసిన విద్యార్థులు సరికొత్త అనుభూతిని సొంతం చేసుకుంటున్నారు. నిజానికి కరోనావైరస్ రాకకు ముందే ప్రాంగణ నియమకాలు ఉత్తరాంధ్రలోని పలు ఇంజనీరింగ్ కళాశాలలో పూర్తికాగా ఫైనల్ ఇయర్ ఇంజనీరింగ్ పరీక్షలు పూర్తి కాకపోవడంతో కొద్ది నెలలుగా విద్యార్ధులలో ఆందోళన నెలకొంది. సర్టిఫికేట్ లు వచ్చినవెంటనే తమకు తెలియజేయాలని ప్రముఖ ఐటి కంపెనీలు విద్యాలయాలకు సమాచారం ఇవ్వడంతో ఆంధ్ర యూనివర్సటీ, గీతం వంటివి విద్యార్థులకు ఫైనల్ పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించడమే కాక సర్టిఫికేట్లుకూడా జారీ చేయడంతో విద్యార్థులు కంపెనీలలో చేరడానికి మార్గం సుగమం ఐంది. ఫైనల్ ఇయర్ పూర్తి చేసుకున్న వారికి ఆన్లైన్లో స్వల్ప శిక్షణ అనంతరం పలు కంపేనీలువర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశం కల్పించడంతో పాటు మొదటి జీతం ఖాతాలో జమ చేయడం విశేషం.ఒక్క గీతం నుంచే దాదాపు 100 మంది విద్యార్థులు విశాఖలోని తమ ఇంటి పట్టున ఉంటూ ఉద్యోగాలు చేస్తుండటం విశేషం.

**ఇలా ఊహించలేదు....**

వర్క్ ఫ్రమ్ హోమ్ ద్వారా కుటుంబంతో కలిసి ఉంటూ ఆన్ లైన్ ద్వారా ఉద్యోగం చేయడం ఎన్నడూ ఊహించలేదని అమెరికన్ కంపెనీ ఫ్లూయ ంట్ గ్రిడ్ కు పని చేస్తున్న సిరి కొల్లి అనే విద్యార్థి వెల్లడించాడు. ఆప్టి మైజ్డ్ సొల్యూషన్స్ లో పని చేస్తున్న భాను ప్రసాద్ మాట్లాడుతూ సీనియర్ ఉద్యోగులు ఆన్ లైన్ ద్వారా చక్కటి మార్గ దర్శకం అందిస్తున్నారని తొలి జీతం ఇంటి నుంచి అందుకోవడం మరచిపోలేనిదన్నాడు. డిఎక్స్ సి టెక్నాలజీ, అమేజాన్, బైజూస్, విప్రో, వర్చూసా తదితర సంస్థలు విద్యార్థులలో కొత్త ఆశలు చిగురింప చేస్తున్నాయని గీతం ట్రైనింగ్ ప్లేస్మెంట్ డైరెక్టర్ కమాండర్ గురుమూర్తి గంగాధరన్ తెలిపారు. కరోనాత సంబంధం లేకుండా గతంలో కేంపస్ రిక్రూట్ మెంట్ల ద్వారా ఎంపిక చేసుకున్న ఇంజనీరింగ్ విధ్యార్థులందరినీ ఉద్యోగాలలో చేర్చుకుంటామని టిసిఎస్ వంటి దిగ్గజ సంస్థలు ప్రకటించడం విద్యార్ధులకు మనో ధైర్యాన్ని ఇస్తోంది.

# నరసింహస్వామి కొండ ఘాట్‌రోడ్డు కు 75 లక్షలు నిధులు మంజారు



భీమునిపట్నం : రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు భీమిలి నియోజకవర్గం ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వంలో పర్యాటక శాఖ మంత్రిగా ఆధ్యాత్మిక వేత ముత్తంశెట్టి. శ్రీనివాసరావు నర్సింహ్ స్వామి కొండ ఘాటు రోడ్డుకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.75 లక్షలు మంజూరు చేసినందుకు వైసీపీ నాయకులు మరియు ప్రజలందరూ ఆనందం వ్యక్తం చేశారు. భీమిలి పర్యాటక రంగం అభివృద్ధి తోనే కాకుండా క్రీడా రంగం ద్వారా యువతకు మరియు ప్రజలకు అనేక మౌలిక సదుపాయాలు కల్పించటం జరుగుతుందని, భీమిలి అన్నివిధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది అని మంత్రి అవంతి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు భీమిలి జీవీఎంసీ 3 వ వార్డు వైసీపీ నాయకులూ మైలపల్లి భారతిషణ్ముఖ రావు ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ సింహాచలం ప్రసాదం స్కీం ద్వారా రూ.53 కోట్లు మంజూరు అవ్వటం అంతలోనే భీమిలి నృసింహ స్వామి వారి దేవస్థానం ఘాటు రోడ్డు అభివృద్ధికి రూ.75 లక్షలు సీఎం వై.యస్ జగన్ మోహన్ రెడ్డి మంజూరు చెయ్యటం చాలా ఆనందకరం అని అన్నారు. ఈ కార్యక్రమంలో అల్లిపిల్లి నర్సింగ రావు, వాసుపల్లి కొండ బాబు, మైలపల్లి లక్ష్మణ రావు, అప్పికొండ అప్పల నాయుడు, బోణి సంజీవ రావు, బాకీ వెంకట రమణ రెడ్డి, చెల్లూరి గౌరి నాయుడు, ఆర్.ప్రభాకర్ నాయుడు, నాగ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతి విగ్రహాలు పంపిణీ



గాజువాక : విశ్వ హిందూ పరిషత్ జీలకర్ర రమణ, భువనేశ్వరి ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను స్థానికులకు పంపిణీ చేశారు. జీ వీ ఎం సీ 76వ వార్డు బాబు జగ్జీవన్ రామ్ కాలనీలో నిర్వహించిన ఈ కార్య క్రమంలో ముఖ్య అతిథిగా బీజేపీ ఎస్సీ సెల్ నగర ఉపాధ్యక్షుడు ములకల పల్లి ఈశ్వర రావు పాల్గొని మాట్లాడుతూ ఈ ఏడాది ప్రతీ ఒక్కరు ఇంటిలోనే వినాయక చవితి పండుగ జరుపుకోవాలని, కోవిడ్ నిభందనలు పాటించాలని సూచించారు. ప్రతీ ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలు వినియోగించాలని, కాలుష్య నివారణకు ప్రతీ ఒక్కరూ ముందుకు వచ్చి మట్టి గణపతి విగ్రహాలు పూజలకు వినియోగించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, పార్వతి, దేవుడమ్మ, జ్యోతి, వెంకట లక్ష్మి, కొండల రావు, క్రాంతి తది తరులు పాల్గొన్నారు.

# శ్రీకాంత్‌కు ఏయూ డాక్టరేట్

## ఉత్తర్వులు అందజేసిన వీసీ ఆచార్య పివిజిడి.ప్రసాదరెడ్డి



వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డినుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న శ్రీకాంత్

ఆంధ్రా యూనివర్సిటీ : ఆంధ్రవిశ్వ విద్యాలయం గ్రంధాలయ విభాగం పరిశోధక విద్యార్థి టి.శ్రీకాంత్‌కు డాక్టరేట్ లభించింది. విభాగాధిపతి ఆచార్య వి.ధన రాజు పర్యవేక్షణలో ' ఏ స్టడీ ఆన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ ఫెసిలిటీ ఇన్ కాలేజెస్ ఆఫ్ ఎడ్యుకేషన్- ఆంధ్రాయూనివర్సిటీ ఏరియా' అంశంపై జరిపిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. బుధవారం ఉదయం వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను శ్రీకాంత్ స్వీకరించారు. తన పరిశోధనలో భాగంగా శ్రీకాంత్ 30 బిఇడి కళాశాలలు, 30మంది లైబ్రేరియన్‌లు, 240 మంది అధ్యాపకులు, 600 మంది విద్యార్థుల నుంచి సమాచారాన్ని సేకరించారు. గ్రంధాల యాలను అధ్యాపకులు, విద్యార్థులు ఏ విధంగా వినియోగించుకుంటున్నారు, సద్వినియోగం చేసుకుంటున్నారు అనే అంశాలను అధ్యయనం చేశారు.

ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను విద్యా విభాగం బిఓఎస్ చైర్మన్ ఆచార్య టి.షారోన్ రాజు, ఏయూ జర్నలిజం అచార్యులు డాక్టర్ చల్లా రామక్రిష్ణ తదితరులు అభినందించారు.

# పట్టణ యూత్ అధ్యక్షుడు బింగి హరికిరణ్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు



భీమునిపట్నం : జీవీఎంసీ రెండువ వార్డు జీరుపేట లో వైసిపి పట్టణ ప్రధాన కార్యదర్శి జీరు వెంకటరెడ్డి ఆఫీసులో పట్టణ యూత్ అధ్యక్షుడు బింగి హరి కిరణ్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు ఘనంగా. నిర్వహించారు. కిరణ్ రెడ్డి కి రాష్ట్ర బి.సి.సెల్ అధ్యక్షుడు అక్కరమాని మంగ రాజు, మాజీ కౌన్సిలర్,ఉప్పాడ నాగేశ్వర రావు, మహిళ అధ్యక్షురాలు జీరు.సుజాత, ఎస్.సి సెల్ అధ్యక్షుడు పందిరి విజయ్, కుంచపు శివ రామ కృష్ణ, అక్కరమాని చినబాబు, ఆర్.ప్రభా కర్ నాయుడు, పట్టణ యూత్ పాల్గొని కేక్ కట్ చేయించి పూలమాలలు వేసి, బొకేలు తో శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమం లో వెంపాడ రమణ రెడ్డి, గంద్రేడ్డి ఈశ్వరరావు, చింతగుంట శివ,దుంప సాయిరెడ్డి,చిల్ల రంగారెడ్డి, జీరు శ్రీనివాస్‌రెడ్డి, పిల్ల రాజేష్, కుమిలి సూర్య నారాయణ, కొయ్యి రామకృష్ణ రెడ్డి, ఎం.ఉమ శంకర్, సరగడ శివారెడ్డి, జీరు భారతి రెడ్డి, చిల్ల రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ దోమల దినోత్సవము (ఆగస్టు 20)



ప్రతీ ఏడాది ఆగస్టు 20 న ప్రపంచ దోమల దినోత్సవముగా జరుపుకుంటారు. సర్ రొనాల్డ్ రాస్ 1897 ఆగస్టు 20న ఆడ ఎనాఫిలస్ దోమ కాటు ద్వారా మలేరియా వ్యాధి మానవులకి వ్యాప్తి చెందుతుంది అని కనుగొన్నారు. దీని గుర్తుగా ప్రతీ ఏడాది ఆగస్టు 20 న ప్రపంచ దోమల దినోత్సవముగా నిర్వహించడం జరుగుచున్నది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయ లక్ష్మి మాట్లాడుతూ, మలేరియా వ్యాధి ప్లాస్మోడియం అనే పరాన్న జీవి వలన వస్తుంది. ఎనాఫిలాస్ అనే దోమ కుట్టడం వలన ఒకరి నుండి ఒకరికి వ్యాపిస్తుంది. తీవ్రమైన తలనొప్పి, వొళ్ళు నొప్పులు, చలి వణుకుతో కూడిన జ్వరం, రోజు విడిచి రోజు జ్వరం రావడం, చెమటలు పట్టడం, వాంతులు వికారం వంటివి మలేరియా లక్షణాలు కాగా, జ్వరం ఉన్న వాళ్ళు ప్రాదమిక ఆరోగ్య కేంద్రాలలోను, ఏదైనా ప్రభుత్వ ఆసుపత్రిలోను, ఆరోగ్య కార్య కర్తల వద్ద రక్త పరీక్ష చేయించుకొని వ్యాధిని నిర్ధారించుకోవాలి. పుర్తి చికిత్స తీసుకోవాలి. మలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాపిస్తుంది కావున దోమలు పెరగకిండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి. దోమతెరలు అందరు వాడాలి. ఇంటి లోపల, బయటా నీటి నిల్వలు లేకుండా చూడాలి. ఉన్న నీటి నిల్వలు వారానికి ఒకసారి ఖాళీ చేసి ఆరబెట్టాలి. తాగి పారేసిన కొబ్బరి బొండాలు, టీ కప్పులు, వాడి పారేసిన టైర్లు, రుబ్బు రోళ్ళు, ప్లాస్టిక్ పాత్రల్లో దోమల లార్వా పెరిగే అవకాశం ఉంది. ఫ్రిడ్జ్ లు, ఎయిర్ కూలర్లు, ప్లవర్ వాజ్ లు దోమల ఉత్పత్తి వనరులుగా ఉన్నందున ప్రజలు వాటిల్లో నీటిని ప్రతీ మూడు రోజులకు ఖాళి చేయాలి. ప్రజలంతా భాగస్వామ్యులు కావాలని తద్వారా మలేరియా నివారణకు పాటు పడగలరని కోరుచున్నాము.

# గణితశాస్త్ర విభాగాధిపతిగా నానాజిరావు

## ఉత్తర్వులు అందజేసిన వీసీ ఆచార్య పివిజిడి. ప్రసాదరెడ్డి



వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న నానాజీరావు

ఏయూ : ఆంధ్రవిశ్వ విద్యాలయం గణితశాస్త్ర విభాగాధిపతిగా ఆచార్య జి.నానాజి రావు నియమితులయ్యారు. బుధవారం ఉదయం వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి నుంచి నియామక ఉత్తర్వులను నానాజి రావు స్వీకరించారు. గురువారం ఉదయం ఆచార్య నానాజిరావు విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరిస్తారు.

# 3200 లీటర్ల బెల్లం పులుపు స్వాధీనం

అనకాపల్లి : బెల్లం పులుపు 3200 లీటర్లు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఉపేంద్ర తెలిపారు. తగరంపూడి పరిసర ప్రాంతాల్లో నిర్వహించిన దాడిలో బెల్లం పులుపు గుర్తించామన్నారు. ఇందులో ప్రమేయం ఉన్న వ్యక్తుల వివరాలు సేకరించి త్వరలోనే అరెస్ట్ చేస్తామని వివరించారు. దాడిలో కానిస్టేబుళ్లు నాయుడుబాబు, మధు, విజయ్, కుమార్, శ్రీను పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ జనసేన కార్పొరేట్ అభ్యర్థి

# పేరి శ్రావణ్‌కుమార్ జన్మదిన వేడుకలు

**పలు సేవా కార్యక్రమాలు చేపట్టిన అభిమానులు**



సింహాచలం : భారతీయ జనతా యువమోర్చా జోనల్ ఇంచార్జ్ మరియు 98 వ వార్డు భారతీయ జనతా పార్టీ జనసేన పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి పేరి శ్రావణ్ కుమార్ గారి జన్మదిన వేడుకలు 98 వ వార్డు సింహాచలం లో భారతీయ జనతాపార్టీ జన సేన నాయకులు కార్య కర్తలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా పెద్ద యెత్తున అభిమానులు కోవిడ్ నిబంధనలను పాటిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు 98 వ వార్డు మొత్తం ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ భారీ కటౌట్లు ఏర్పాటుచేశారు మరియు పేదలకు భోజనాలు పంచిపెట్టారు కేక్ కట్ చేసి సంబరాలు. జరుపుకున్నారు.

జన్మదిన సందర్భంగా శ్రావణ్ కుమార్ మనసు ఆర్ఫనేజ్ లో ఉన్న విద్యార్థిని చదువు నిమిత్తం 3 వేల రూపాయలు ఆర్థిక సహాయం మరియు బంగారు తల్లి వృద్ధాశ్రమం నందు వృద్ధులకు రొట్టెలు పళ్ళు పంచి పెట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరియు భీమిలి నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ కె.ఎన్.పి.చక్రవర్తి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

98వ వార్డు భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్ వెంకు మహంతి. 98వ వార్డు భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి వేమూరి మహేష్, బీజేపీ యువ మోర్చా అధ్యక్షులు చొప్పా వెంకట్రావు, భార తీయ జనతా యువమోర్చా ప్రధాన కార్యదర్శి పీతల చిరంజీవి, 98 వ వార్డు భారతీయ జనతా యువ మోర్చా ఉపాధ్యక్షులు తాళ్లూరి శరత్ చంద్ర సాయి, సూర్య కిరణ్, అశోక్. చైతన్య తదితర నాయకులు పాల్గొన్నారు.



# విషమంగానే ఎస్పీ బాలు ఆరోగ్యం



చెన్నై: కరోనాతో చికిత్స పొందుతున్న ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉందని చెన్నైలోని ఎంజీఎం ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు హెల్త్ బులెటిన్ విడుదల చేశాయి. ఎస్పీ బాలుకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని..

నిపుణుల బృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోందని ఎంజీఎం వైద్యులు పేర్కొన్నారు. ఎస్పీబీ కరోనా నుంచి త్వరగా కోలుకోవాలని సినీ పరిశ్రమకు చెందిన వారితో పాటు సంగీతప్రియులూ ఆగస్టు 20న సామూహిక ప్రార్ధనలు చేయాలని తమిళ సినీ పెద్దలు కోరారు. ప్రముఖ నటులు రజనీకాంత్, కమల్‌హాసన్, దర్శకుడు భారతీరాజా, సంగీత దర్శకులు ఇళయరాజా, ఏఆర్ రెహమాన్, రచయిత వైరముత్తు కలిసి ఓ ప్రకటన విడుదల చేశారు.



# పూడిమడకలో జెట్టి నిర్మాణం కొరకు స్థలాన్ని గుర్తించిన అధికారులు

అచ్యుతాపురం : పూడిమడకలో జెట్టి నిర్మాణం కొరకు స్థలాన్ని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. బుధవారం మత్స్యకార గ్రామమైన పూడిమడకలో ఫిషరీస్ జెడి ఫణిప్రకాశ్, అనకాపల్లి ఆర్ డి ఒ సీతారామరారావు పర్యటించారు . జెట్టి నిర్మాణం కొరకు పూడిమడక సర్వే నెం 138 లో 214 ఎకరాలు భూమిలో 37 .50 ఎకరాలును గుర్తించినట్లు అధికారులు తెలిపారు

ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రమణ, ఎఫ్ డిఒ శ్రావణి, వైసిపి నాయకులు చేపల వెంకటరమణ, వాసుపల్లి శ్రీనువాసరావు, చోడిపల్లి అప్పారావు, పోలవరపు పారునాయుడు, మేరుగు అప్పలనాయుడు, సూరాడ ధనరాజు, గంగిరి రవి తదితరులు ఉన్నారు.

# విజయభాను సంపాదకీయం

## జన్యుమార్పిడి సరే.. జాగ్రత్త అవసరం

భారతదేశంలో వ్యవసాయ వైవిద్యం చాలా ఎక్కువ. అయితే హరిత విప్లవ ఫలితాలతో జీవవైవిద్యం కొంతమేరకు దెబ్బతిన్నది. బీటీ పత్తితో బీటీ యేతర రకాలు కనుమరుగయ్యాయి. దీనితో చీడ పీడల సమస్య ఇంకా పెరిగి రైతుకు సాగు భారంగా మారింది. ఈ నేపథ్యంలో, దేశం ఇప్పుడిప్పుడే సేంద్రియ సాగుకు, సాంప్రదాయ సహజసాగుకు మారుతున్నది. ఈ పరిస్థితిలో సంకరజాతి వంగడాలపై చర్చ సాగుతున్నది.

వ్యవసాయాన్ని ఏకఛత్రాధిపత్యంతో తన కబంధ హస్తాలతో కబళిస్తున్న బహుళ జాతి సంస్థలు భారతీయ వ్యవసాయంపై మరో పాచిక విసిరాయి. 'జన్యుమార్పిడి ఆవాల' రూపంలో దేశంలో ప్రవేశించేందుకు సర్వం సిద్ధం చేసుకున్నాయి. జన్యుమార్పిడి సంకరజాతి ఆవాల రకం DMH_11 (దార మస్టర్డ్ హైబ్రిడ్)ను దేశంలో జన్యుమార్పిడి పంటల శాస్త్రీయతను పరీక్షించే జెనెటిక్ ఇంజినీరింగ్ అప్రైజల్ కమిటీ తాజాగా కేంద్ర పర్యావరణ శాఖకు వాణిజ్యసాగుకోసం సిఫార్స్ చేసింది. అనుమతించాలా? వద్దా? అనే విషయం మనముందున్నది. ప్రస్తుతం వాణిజ్యసాగుకు ఉద్దేశించిన అవాల పంట హైబ్రిడ్ తయారీలో వాడే జన్యువు విషయంలో అప్రమత్తత అవసరం. సహజంగానే ఆవాలు వస్తాయి, కానీ సమస్యల్లా వాటిలో వాడిన విష ప్రోటీనే. దీంతో మానవ ఆరోగ్యం దెబ్బతింటుందనే నివేదికలు వున్నాయి. పశువులు మేతగా వాడితే పర్యవసానాలు ఏంటి అన్న సందేహానికి సమాధానాలు లేవు.

ఇదిలా ఉంటే సోయాబీను, మక్కజొన్న వంటి పంటలు పురుగులు, తెగుళ్లు, కలుపు మందులను తట్టుకునే గుణంతో పాటు, అధిక పోషక విలువలు కల్గిన లక్షణాలు కలిగి వాణిజ్యసాగుకు విడుదల చేయబడ్డాయి. ఆవాలు, క్యాబేజీ, బొప్పాయి, పుచ్చ, కర్భూజ పంటలలో జన్యుమార్పిడి జరిగి విడుదలకు సిద్ధంగా వున్నాయి. ప్రపంచవ్యాప్తంగా జన్యుమార్పిడి పంటలను 19.1కోట్ల హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ప్రధాన పంటలలో పోషకాలు, దిగుబడి పెంపుద్వారా ఆహార, పోషక భద్రతకు జన్యుమార్పిడి పంటలే శరణ్యమని ప్రపంచ ఆహార, వ్యవసాయ సంస్థ పేర్కొన్నది.

2002లో పురుగులను తట్టుకునే జన్యుమార్పిడి పత్తిని భారతదేశంలో ప్రవేశపెట్టిన తర్వాత పత్తి సాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగింది. అతి పెద్ద ఎగుమతి దారుగా భారతదేశం ఎదిగింది. 2008లో BG-11 విడుదల చేసినప్పుడు కూడా కొంత వ్యతిరేకత ఏర్పడినప్పటికి, BG-11 పత్తి జన్యుమార్పిడి పంటలు ప్రవేశ పెట్టడం జరిగింది. BG-1, BG-11 జన్యుమార్పిడి పత్తిలో గులాబీరంగు పురుగుకు నిరోధకత ఏర్పడటంతో, మళ్లీ జన్యుమార్పిడి పంటల అనర్హతలపై పరిశోధకులకు పెద్ద ఛాలెంజ్ ఏర్పడింది. ఇటీవల కేంద్రప్రభుత్వం BG-111 (HT-కాటన్) పరిశోధనలు జరిగి, విడుదల చేయకముందే మార్కెట్లోకి దొడ్డిదారిన రావటం జరిగింది!

దేశ వ్యాప్తంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా తగిన ఆహార ఉత్పత్తులను సమకూర్చుకోవటం, నాణ్యమైన ఆహార ఉత్పత్తులను గణనీయంగా పెంచుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ప్రస్తుతం మన దేశం దాదాపు రూ.12 వందల కోట్ల విలువ గల వంట నూనెలను దిగుమతి చేసుకుంటున్నది. సాధారణ అవాలతో పోలిస్తే జన్యుమార్పిడి అవాలు 30శాతం నూనెను అధికంగా ఇస్తాయి. కాబట్టి దేశానికి వంట నూనె అవసరాలను జన్యుమార్పిడి మస్టర్డ్ రకాలు తీర్చగలుగుతాయి. అయితే ఆవాలను, ఆవ నూనెలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంపై ఉండే ప్రభావాలను శోధించాలి. అందుకు తగిన ప్రపంచ ప్రమాణాలున్న, ప్రయోగశాలలు నెలకొల్పాలి. దీనికి ఒకసారి అనుమతి దక్కితే, ఇప్పటికే జన్యుమార్పిడి చేయబడి సిద్ధంగా ఉన్న ప్రధాన ఆహార పంటలైన వరి, గోధుమ, పొద్దుతిరుగుడు, బంగాళాదుంప, టమాటాలకు అనుమతి లభిస్తుంది. వాటితో ఏర్పడే పర్యవసానాలను గురించి ఆలోచించాలి.

2010 లో, GEAC కేంద్రానికి BT జన్యువు జొప్పించిన తవంగను వాణిజ్య విడుదలకు సిఫార్సు చేస్తే, దానిపై అప్పటి ప్రభుత్వం మారటోరియం విధించింది. పొరపాటున జన్యుమార్పిడి ఆవాలను దేశంలో విడుదల చేస్తే, అదే మొట్టమొదటి జన్యుమార్పిడి ఆహారపంట అవుతుంది. ప్రపంచం, దేశవ్యాప్తంగా పోషకాహార లోపం అధికంగా ఉన్న కారణంగా 'గోల్డెన్ రైస్' వంటి అధిక విటమిన్-ఎ కల్గిన రకాలు అందుబాటులోకి తేవాలి. వేగంగా మారుతున్న ఈ వైవిధ్యమైన వాతావరణ పరిస్థితులలో జన్యుమార్పిడి పంటలతో ఉపయోగాలు ఉండటం వలన రాను రాను జన్యుమార్పిడి పంటలకు అధిక ప్రాధాన్యం లభించనున్నది. అమెరికా లాంటి దేశాలలో జన్యుమార్పిడి పంటల వలన వ్యవసాయరంగంలో అనేక విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి. 2012 లో మక్కజొన్నలో సాగు నీరు తక్కువ ఉండే ప్రాంతాలకు అనుకూలంగా, నీటి ఎద్దడిని తట్టుకునే జన్యుమార్పిడి రకాన్ని కనుగొనటం జరిగింది.

## నేడు సత్యదేవుని హుండీలు లెక్కింపు



అన్నవరం...... తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తాలూకా హుండీలు లెక్కింపు నేడు ఉదయం 7-30 ని.లకు లెక్కించుటకు సదరు సొమ్మును బ్యాంకులో జమ చేయుటకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.త్రినాధరావు ఉత్తర్వులు మేరకు యావన్మంది భక్తులకు,గ్రామస్థులకు తెలియజేయడమైనది.

## గుండె పగిలినట్లు అనిపించింది : రాహుల్



న్యూఢిల్లీ: మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని రిటైర్మెంట్ తనను షాక్‌కు గురిచేసిందని టీమిండియా క్రికెటర్ కేఎల్ రాహుల్ అన్నాడు. మిస్టర్ కూల్ తీసుకున్న నిర్ణయం కారణంగా అతడికి సరైన విధంగా వీడ్కోలు పలికే అవకాశం లేకుండా పోయిందని వాపోయాడు. తనతో మరొక్కసారి డ్రెస్సింగ్ రూం షేర్ చేసుకోవాలని ప్రతీ ఒక్క ఆటగాడు కోరుకుంటాడని పేర్కొన్నాడు. ధనాధన్ ధోని అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెబుతున్నట్టు శనివారం ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ హఠాత్పరిణామంతో అభిమానులతో పాటు సహచర ఆటగాళ్లు కూడా షాక్‌కు గురయ్యారు.

ఈ నేపథ్యంలో ధోని రిటైర్మెంట్ విషయం గురించి కేఎల్ రాహుల్ మంగళవారం ఓ జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. " నిజంగా నా గుండె పగినట్లు అనిపించింది. చాలా సేపటి వరకు తేరుకోలేకపోయాను. నాతో పాటు ధోని సారథ్యంలో ఆడిన ప్రతీ క్రికెటర్ ఇలాంటి ఉద్వేగానికి లోనై ఉంటారు. తనకు వీడ్కోలు చెబుతూ స్పెషల్‌గా ఫేర్‌వెల్ ఏర్పాటు చేసే వీల్లేకుండా పోయింది. జట్టులోని ప్రతి ఆటగాడికి ధోని పూర్తి స్వేచ్ఛనిచ్చేవాడు. ఎలా ఆడాలో చెబుతూనే మా సహజత్వాన్ని కోల్పోకుండా, మా తప్పుల్ని మేమే తెలుసుకునేలా గైడ్ చేసేవాడు.

మమ్మల్ని మాలాగే ఉంచిన ఘనత ధోనీకే దక్కుతుంది. ఎవరికైనా ఏదైనా సందేహం వస్తే మొదటగా పరిగెత్తుకు వెళ్లేది ధోని దగ్గరికే. తనెప్పుడూ మమ్మల్ని ముందుకు నడిపేందుకు సిద్ధంగా ఉండేవాడు. ధోనికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం. ధోనితో పాటు రోహిత్, కోహ్లి సారథ్యంలో ఆడటానికి నేను ఇష్టపడతాను. ఒక్కొక్కరి దగ్గర నుంచి ఒక్కో విషయం నేర్చుకోవచ్చు"అని చెప్పుకొచ్చాడు. కాగా కర్ణాటకకు చెందిన రైట్‌హ్యాండ్ బ్యాట్స్‌మెన్ కేఎల్ రాహుల్ ఐపీఎల్-2020లో భాగంగా కింగ్స్ ఎలెవన్ పంజాబ్ తరపున కెప్టెన్‌గా మైదానంలోకి దిగనున్నాడు.

## మానవత్వం మంట గలిసింది.. మృతదేహాన్ని సైకిల్‌పై స్మశానానికి తరలింపు..



బెలగావి (కర్ణాటక) : మానవత్వం మంట గలిసింది.. బెలగావి జిల్లాలో అమానుష ఘటన చోటు చేసుకుంది. ఓ వ్యక్తి మృతి చెందడంతో కరోనా భయంతో ఏ ఒక్కరు వారికి సాయపడలేదు. చేసేది లేక కుటుంబ సభ్యులు సైకిల్‌పై మృతదేహాన్ని దహన సంస్కారాలకు తరలించారు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకోగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది. వివరాలు.. బెలగావి జిల్లా కిట్టూరులో ఓ వ్యక్తికి రెండు రోజులు జ్వరం వస్తుంది. కరోనా లక్షణాలు కూడా ఉండడంతో దవాఖానలో చేర్పించాలని ఇరుగు పొరుగు వారు సూచించారు. కుటుంబ సభ్యులు అత్యవసర నెంబర్‌కు ఫోన్‌చేసి అంబులెన్స్‌కు సమాచారం అందించగా వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. మూడో రోజు ఆ వ్యక్తికి శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురై తీవ్ర అనారోగ్యంతో మృతి చెందాడు. కరోనా భయం కారణంగా వారికి సాయ పడడానికి బంధువులతో పాటు ఏ ఒక్కరు రాకపోవడంతో చేసేది లేక ప్లాస్టిక్ కవర్‌లో మృతదేహాన్ని చుట్టి సైకిల్ వెనక క్యారెల్‌పై తాళ్లతో కట్టి జోరు వానలో దహన సంస్కారాలకు తరలించారు.

ఈ ఘటనపై ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు నోరు మెదపకపోవడం గమనార్హం. కాంగ్రెస్ రాష్ట్ర చీఫ్ డికె శివకుమార్ ఈ వీడియోను ట్విట్టర్‌లో షేర్ చేస్తూ 'బెలగావి జిల్లా కిట్టూరులో 70 ఏళ్ల వ్యక్తి మృతి చెందగా.. బంధువులు, భారీ వర్షంలో సైకిల్‌పై దహన సంస్కారాల కోసం మృతదేహాన్ని తీసుకెళ్లాల్సి వచ్చింది. సీఎం యాడ్యూరప్ప.. మీ ప్రభుత్వం ఎక్కడ ఉంది? అంబులెన్స్ ఎందుకు అందించలేదు? ప్రభుత్వానికి మానవత్వం లేదు. కరోనాను ఎదుర్కోవడంలో పూర్తిగా విఫలమైంద'ని విమర్శించారు.

## ఆరోగ్య మంత్రికి కరోనా పాజిటివ్..

### హెూం క్వారంటైన్‌లోకి జార్ఖండ్ సీఎం

రాంచీ : జార్ఖండ్ ఆరోగ్య మంత్రి బన్నా గుప్తాకు కరోనా వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ హెూం క్వారంటైన్‌కు తరలారు. రాంచీలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశానికి బన్నా గుప్తా హాజరయ్యారు. కేబినెట్ సమావేశం ముగిసిన మూడు గంటల తరువాత బన్నా గుప్తాకు పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఇప్పటివరకు సీఎం హేమంత్‌కు రెండు సార్లు కరోనా పరీక్షలు చేశారు. నాలుగు రోజుల తర్వాత ఆయన మళ్లీ కరోనా పరీక్ష చేయించుకోనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అంతకుముందు ముఖ్యమంత్రి ఇంట్లో 20 మంది సిబ్బందికి కరోనా సోకింది. సోరెన్ బుధవారం అన్ని కార్యక్రమాలను రద్దు చేశారు. జారండ్‌లో కరోనా సోకిన రెండో మంత్రి బన్నా గుప్తా. అంతకుముందు తాగునీరు, పారిశుధ్య శాఖ మంత్రి మిథిలేశ్ ఠాకూర్ కూడా కరోనా బారిన పడ్డారు. ఇప్పటివరకు రాష్ట్రంలో ఐదుగురు ఎమ్మెల్యేలకు కరోనా సోకింది.

## యువత సేవా దృక్పథంతో సామాజిక సేవలు చేయాలి



అనకాపల్లి : యువత సేవా దృక్పథంతో ముందుకు వచ్చి సామజిక సేవల్లో పాల్గొనాలని జై అనకాపల్లి సేన పిలుపునిచ్చింది.బుధవారం మండలంలోని కొత్తూరు గ్రామ రామాలయం వద్ద జై అనకాపల్లి సేన అధ్యక్షుడు కొణతాల సీతారాం ఆధ్వర్యంలో 26 వ రోజు మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జై అనకాపల్లి సేన కార్యదర్శి బొడ్డేడ మధు మాట్లాడుతూ తమ నాయకులు సీతారాం సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ యువతను కూడా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు అన్నారు. అనంతరం 250 మందికి మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోడా దిలీప్, కుమార్, మోసురి నాగేంద్ర, బొడ్డేడ కిషోర్, మోసూరి శీను, మోసూరి నవీన్, మోసూరి గణేష్ , మోసూరి మహేష్, మోసూరి సతీష్, గ్రామ పెద్దలు, మహిళా కార్యకర్తలు, సీతారాం అభిమానులు పాల్గొన్నారు.

## ఇలాగైతే కరోనా మహమ్మారిని అరికట్టగలమా

### యస్‌బిఐ బ్యాంక్ వద్ద సామాజిక భౌతిక దూరం సూపర్



పరవాడ : ఒకపక్కన కరోనా వైరస్ ప్రపంచాన్ని వణికిస్తున్న తరుణంలో కనీసం సామాజిక భౌతిక దూరం పాటించకుండా ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు వ్యవహరిస్తున్నారు. పరవాడ మండలము వాడచీపురుపల్లి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దగ్గర జనాన్ని చూస్తే భయంగా ఉందని స్థానికులు పేర్కొంటు న్నారు. దయచేసి బ్యాంకు సిబ్బంది వచ్చి సామాజిక దూరం పాటించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కొమ్మికలో ఇల్లు దగ్ధం



కొయ్యూరు : కొయ్యూరు మండలం కొమ్మిక గ్రామంలో ఓ ఇల్లు ఆకస్మికంగా దగ్ధమైంది. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో బందుల భూలోక అనే వ్యక్తి యొక్క పాక ఇల్లు నుంచి పొగలు రావడంతో అప్రమత్తమైన గ్రామస్తులు, యువకులు మంటలు ఆర్పారు. ఘటనలో ఇంటి సామాన్లు, మంచం తగలబడ్డాయి. ప్రభుత్వం స్పందించి సహకారం అందించాలని కోరారు.

## మహప్రభో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయరా...




పరవాడ : పరవాడ సినిమాహల్ జంక్షన్ నుండి వెన్నలపాలెం గ్రామానికి వెళ్ళే రహదారి మధ్యలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలనీ స్దానిక ప్రజలు కోరు తున్నారు. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడము వలన ప్రమాదాలు జరుగుతున్నాయనీ అన్నారు. అదేస్దలంలో ఇటీవలే రెండు ప్రమాదాలు జరిగాయాయి అని స్దానికులు తెలిపారు, ఇప్పటికైనా సంభందిత అదికార్లు స్పందించి స్పీడు బ్రేకర్లు ఏర్పాటుచేయాలనీ పలువురు కోరుతున్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో హైపో క్లోరైడ్ పిచికారీ

కొయ్యూరు : రాజేంద్రపాలెం పరిధిలోని శానిటేషన్‌లో భాగంగా పిహెచ్‌సి, ఎంపిడిఒ కార్యాలయం, మహిళా సమైఖ్య భవనాల్లో, రోడ్డు పక్కన, బయట పరిసరాల్లో హైపోక్లోరైడ్ పిచికారీ చేయడం జరిగింది. ఈవోపిఆర్‌డి రామగోవింద్ ఈ పిచికారీ పనులను పర్యవేక్షించారు.

# భక్తి వాఙ్మయంలో భజగోవిందం

## సంకీర్తన



క్షణక్షణం మానవ జాతి యావత్తు అశాంతితో కొట్టుమిట్టాడుతోంది. స్వార్థము, మోహము, తృష్ణ, డంభములతో నడిచే మానవ జాతికి సత్సాంగత్యము, భగవద్భక్తి మొదలైన ఆర్షధర్మములే ప్రశాంతిని చేకూర్చగలవు. శంకర భగవత్పాదులు అందించిన భజగోవింద స్తుతి భక్తివాఙ్మయములో అద్వితీయ మైనది. ధార్మిక ప్రబోధము, విష్ణుభక్తి ప్రేరకముఅగు ఈ స్తుతికిగల భక్తిప్రచారము అనన్యసామాన్యము. దీనికి మోహముద్గరమని నామాంతరము కలదు. ఈ స్తుతి పండితులనుండి పామరుల వరకూ జీవన సత్యాన్ని బోధిస్తుంది. దీనిని పఠించుటవలన, అందలి సారాన్ని కొంతలోకొంతైనా ఆచరించిన జన్మ ధన్యత నొందగలదు. ఈ స్తుతి ఛందములోను, పద్య శిల్పము లోను, భావగౌరవములోను పదముల పొందికలోను అత్యంత రమణీయమైనది. శంకర భగవత్పాదులు అపర శంకరావతారం కారణజన్ములు. 32 సంవత్సరములే జీవించినా శంకరులు ఆనాటి సాంఘీక, సామాజిక, ఆధ్యాత్మిక స్థితిగతులను సమూలాగ్రంగా సమీక్షించి, భారత జాతిని ఒక్క త్రాటిపై తెచ్చిన ఘనత వీరికే చెందుతుంది. హిందూ మతస్థులందరికీ, అన్ని శాఖలవారికి అనువుగా స్తోత్రరాజాలను రచించిన ఘనత ప్రప్రథమంగా శంకరులకే చెందుతుంది. మూడు పర్యాయములు భారతదేశ సంపూర్ణ యాత్రచేసి అద్వైత తత్వాన్ని ప్రతిపాదించిన మహనీయులు శంకర భగవత్పాదులు. నాలుగు చెరగులా నాలుగు శంకరాచార్య పీఠాలను స్థాపించి ఆధ్యాత్మిక ప్రతిపత్తి కల్పించిన పరివ్రాజకుడు శ్రీ శంకర భగవత్పాదులు. ఒక విధంగా భారతీయ జీవన విధానాన్ని దిశానిర్దేశనం చేసిన మహోన్నత వ్యక్తి శ్రీ శంకర భగవత్పాదులు. అసలు భజగోవింద స్తుతి రచించటానికి ఒక వృద్ధుడు కారణభూతుడు. వ్యాకరణ పాఠాన్ని వల్లెవేయటంవలన ప్రయోజనం లేదని గోవిందుని భజించుటయే ముఖ్యమని, అదే మానవ జన్మకు తరుణోపాయమన్నిభజగోవింద స్తుతిని అందించారు శంకర భగవత్పాదులు. మొదటి శ్లోకంలో భజగోవింద మూడుసార్లు అనటంలో పునరుక్తి దోషములేదనుట భాషాకోవిదుల అభిప్రాయం. విషయము అర్ధమైన రీతిలో నివేదించటంలో ఔచిత్యమున్నది. మొదటిసారి దీక్షాగురువులు గోవింద పాదులవారిని స్మరించటం, రెండవసారి శ్రీమన్నారాయణు ని మూడవసారి తత్వభూతమైన స్వరూపాన్ని స్మరించారని వ్యాఖ్యానకారుల అభిప్రాయం. ఇక శ్లోకాల విషయానికి వస్తే అత్యాశలేని జీవితం. ఉన్నదానిలో సంతృప్తి చెందటం (మూఢ జహిహిధనాగమతృష్ణా), మోహాన్ని వదలి మానవీయంగా బ్రతుకుట నేర్చుకోవాలి (నారిస్త్యన భరనాభిదేశం), స్వజనులు వ్యవహరించేరీతి. మరణ సమయంలో భార్యాపిల్లలు భీతి చెందుట (యావత్పృదనో నిరసతిదేహీ) వివరిస్తారు. అలాగే యదార్థతత్వాన్ని చింతన చేయాలి (కాతేకాన్తాకస్తే పుత్రః), నిస్సంగత్వం, నిర్మోహత్వం, నిశ్చలతత్వం, జీవనముక్తి హేతువు (సత్సంగత్వే నిస్సంగత్వం)గా స్వీకరిస్తూ ధనవన గర్వాన్ని వీడి శాశ్వతతత్వాన్ని పొందే ప్రయత్నం చేయాలి. (మాకురువన గర్వ) సజ్జన సాంగత్యంతోనే జన్మతరిస్తుంది (కాతేకాన్తానగత చింతా), బహుకృత వేషాలతో జీవిత వలయంలో చిక్కుకొని సత్యదర్శనాన్ని పొందటంలేదు. (జటిలో ముండిలుంచితకేశః) అంతేగాదు జ్ఞానవిహీనునికి గంగాసాగర గమనం ముక్తినందించదని (కురుతే గంగాసాగర గమనం) సర్వసంగ పరిత్యాగికి సుఖానుభూతి సులభతరమని (యోగరతోవా భోగరతోవా), నేనెవరినని ప్రశ్నించుకుంటే సంసార స్వప్నతుల్యమని (కస్త్వంకో అహంకుత ఆయాతః) బోధపడుతుంది. సమచిత్తుడవైతేనే పరమాత్మను పొందగలవు. (త్వయిమయిచ అన్యత్రైకోవిష్ణుః), సమత్వభావన అలవరచుకుంటే (శత్రేమిత్రౌపుత్రౌ బంన్ధ్), సో అహం తత్వాన్ని గ్రహించగలవు. (కామక్రోధంలోభం మోహం). అలాగే ధనార్జనవల్ల శుఖము కలుగదు (అర్థమనర్థం భారయ నిత్యం). చివరగా ప్రాణాయామం, జపతపాదుల వలన సత్యతత్వం బోధపడుతుంది.

(ప్రాణాయామం ప్రత్యాహారం). గురువు నాశ్రయించిన వానికి పరమాత్మ దర్శనం సులభతరవౌతుంది. ఎటొచ్చి వాటిని ఆచరణాత్మకం చేసినపుడే వ్యక్తి సంస్కారవంతుడు కాగలడు. ఇటువంటి జీవన సత్యగుళికలని మనిషి పుట్టుకనుండి మరణం వరకు అన్ని ఇతివృత్తాలని తత్వవిచారంగా 32 ఏళ్ళ వయస్సులో రచించటం శంకర భగవద్పాదులు, అవతార పురుషులని ఘంటాపథంగా చెప్పవచ్చు.

ఈ శ్లోకాలను పఠించాలి, అందలి మూలార్థాన్ని స్వీకరించి మానవ జన్మను సార్థకత చేసుకోవాలి. శంకరాచార్య రచించిన కనకధారా స్తవము, సౌందర్య లహరి ఇత్యాది రచనలు దైనం దినంగా దీక్షాతత్పరులుగా పఠిస్తే సర్వకార్యసిద్ధి లభించుటయే గాక, మానసిక ప్రశాంతత సిద్ధించగలదు.

# చోడవరంలో ఘనంగా ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం

చోడవరం : చోడవరం పట్టణం పాత బస్టాండ్ ఆవరణలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని బుధవారం ఉదయం ఘనంగా నిర్వహించారు. ఫోటోగ్రఫీ పితామహుడు లూయిస్ - జకస్ - మండే డాగ్యుర్ 182 వ జయంతి ఉత్సవాల్లో భాగంగా చోడవరం - మాడుగుల నియోజకవర్గాల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షా, కార్యదర్శులు బొంగ రాల సురేష్, కుప్పిలి అప్పలస్వామి ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి చోడవరం ఎస్ ఐ లక్ష్మీనారాయణ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా 500 మాస్కులు పంపిణీ చేశారు. అలాగే ఆన్లైన్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన ఫోటోగ్రాఫర్లకు మినిస్ట్రీ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ప్రభుత్వం జారీచేసిన 150 ప్రధాని కుశాల్ గ్రేడింగ్ సర్టిఫికెట్లను ఫోటోగ్రాఫర్లకు అందజేశారు. అనంతరం ఎస్ ఐ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఫోటోగ్రఫీ కి భాష ఉండదని, ఒక ఫోటో ద్వారా అనేక కోణాలు వెలుగు చూస్తాయని, అనేక సామాజిక, సాంస్కృతిక తదితర అంశాలు వీటితో ముడిపడి ఉన్నాయని అన్నారు. ప్రపంచ ఫోటో గ్రఫీ దినోత్సవం లో తాను పాల్గొనడం సంతోషంగా ఉందని అన్నారు. సామాజిక బాధ్యతగా కరోనాపై అవగాహన కల్పించడంతో పాటు, యూనియన్ ద్వారా మాస్కులు పంపిణీ చేయడం పై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్య క్షులు రాజాన శివ, ట్రెజరర్ ఆడారి తులసి రావు, సభ్యులు, విజయ్, పి సుధాకర్, బాలు, ప్రభాకర్, బద్రి, కళ్యాణ్, చోడవరం, మాడుగుల నియోజకవర్గాలలో వివిధ మండల, గ్రామాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు పాల్గొన్నారు.


ఎస్ఐ లక్ష్మీనారాయణ చేతుల మీదగా మాస్కులు అందుకుంటున్న ఫోటోగ్రాఫర్స్ యూనియన్ నాయకులు సురేష్, అప్పలస్వామి

# కొత్త కూలీరేట్లు ఇవ్వకపోతే విధులు బహిష్కరిస్తాం

జీసీసీ హామాలీ జిల్లా ప్రధాన కార్యదర్శి పండుబాబు



అనంతగిరి : విశాఖ జిల్లా అనంతగిరి, పాడేరు ఏజెన్సీ 11 మండలాల్లో జిసిసి గుదాములో విధులు నిర్వహిస్తున్న కలాసి కార్మికుల సమ్మె నోటీస్, గత సంవత్సరం 2019 నుండి 2020 నాటికి కొత్త కూలి రేట్లు జీవో విడుదల చేయవలసి ఉన్నప్పటికీ సుమారు ఎనిమిది నెలలు నడుస్తున్న కూలీ రేట్లు జీవో విడుదల చేయలేదు. దీనికితోడు కరోనా దేశమంతా భయంతో ఉన్నప్ప టికీ కళాశీలు రెడ్ జోను వంటి ప్రాంతాలకు వెళ్లి నిత్యా వసర సరుకులు సరఫరా చేస్తున్న పుటికి ప్రభుత్వం కానీ ఇటు సంఘం అధి కారులు కానీ స్పందించక పోవడం బాధాకరం అందుకే రాష్ట్ర ఏఐటియుసి తేదీ 26, 27 రెండు రోజులు పనులు బందు చేయాలని పిలుపు ఇవ్వడం జరిగిందని మా సమస్యలు పరిష్కారం జరగకపోతే పూర్తిగా సమ్మెలో వెళ్తామని జిసిసి హమాలి జిల్లా ప్రధాన కార్యదర్శి పండుబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సత్తిబాబు, బలరాం, నీలకంఠం, చందు, వెంకటేశ్వర రావు, సత్తిబాబు, సోమరాజు, సీతయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డూరు లో రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించిన జేసీ వేణుగోపాల్ రెడ్డి


రైతు భరోసా కేంద్రం సేవలపై స్థానిక రైతులను ఆరా తీస్తున్న జెసి వేణుగోపాల్ రెడ్డి

చోడవరం : మండలంలోని అడ్డూరు గ్రామం లో రైతు భరోసా కేంద్రాన్ని జెసి వేణుగోపాల్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రం ద్వారా సరఫరా చేస్తున్న విత్తనాలు, ఎరువులు తదితర వాటిపై స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు.

అలాగే గ్రామ సచివాలయం అధికారులు, వాలంటీర్ల ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి అనేక సంక్షేమ పథకాలను చేపడుతుందని, వాటిని ప్రజలకు అందేలా చూసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, విధినిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ జె.డి, ఏవో లతోపాటు, చోడవరం ఎం డి ఓ దుర్గా శ్యాంసుందర్, డిప్యూటీ తాసిల్దార్ రాజా, సిఎస్డి టీ.కే.త్రినాధ రావు, వైసిపి సీనియర్ నాయకులు శరగడం సిమ్మి నాయుడు, స్థానిక పెద్దలు, రైతులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వార్డు వాలంటీర్లను ముఖ్యమంత్రి తో పోల్చిన వైఎస్ఆర్సీపీ మాజీ కౌన్సిలర్

- ముఖ్యమంత్రి చెప్పిన మనుషులకు మాత్రమే వాలంటీర్లుగా నియమించామని అందరి ముందు ఒప్పుకున్న వైనం
- నర్సీపట్నంలో వింత స్టేట్మెంట్ లతో తలలు పట్టుకున్న వైసీపీ నాయకులు



నర్సీపట్నం : వార్డు వాలంటీర్లు రాష్ట్ర ముఖ్యమంత్రి తో సమానమనీ, గేములు బాగా ఆడుకుంటున్నారు ముఖ్యమంత్రి ఇచ్చిన ఫోన్ లు మాత్రం వాడడం లేదని మాజీ కౌన్సిలర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన వీడియో వైరల్ అవుతోంది. ముఖ్యమంత్రికి ఇష్టమైన మనుషుల్ని మాత్రమే వాలంటీర్లుగా వేశారన్న విషయం స్పష్టం చేసారు. ఏడవ సచివాలయం ఉన్న 12వ వార్డు లో వార్డు వాలంటీర్లు అందరిని ముఖ్యమంత్రి జగన్ కు ఇష్టమైన మనుషులు మాత్రమే నియమించినట్లు, మీరంతా ముఖ్యమంత్రి జగన్ తో సమానం అనీ, వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంఘటన మున్సిపాలిటీలోని ఏడవ సచివాలయంలో చోటుచేసుకుంది. నర్సీపట్నం నియోజకవర్గంలో శాసనసభ్యులు పెట్ల ఉమాశంకర్ కూడా ఇటువంటి వ్యాఖ్యలు ఇప్పటివరకు చేయలేదు. మరో పది అడుగులు ముందుకు వేసి ఇంటింటికి తిరిగి బ్రోచర్ పట్టుకొని ప్రచారం చేయాలని వారికి హుకుం జారీ చేశారు సదరు మాజీ కౌన్సిలర్. ముఖ్యమంత్రి ఇచ్చిన ఫోన్ లు వాడటం లేదని అధికారులు ఇచ్చిన మెసేజ్ లకు ఎవరూ రెస్పాండ్ కావడం లేదని వాలంటీర్లను నిలదీశారు. చెప్పకుండా వాలంటీర్లు సచివాలయానికి రావడం మానేయడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు . చెప్పి మానేయాలి అని సలహా ఇచ్చారు. అందరూ సక్రమంగా రావడం లేదనే విషయాన్ని రుజువు చేశారు. దీంతో మొత్తం వాలంటరీ వ్యవస్థ పరువు తీసినట్లు రుజువైంది. ఈ విషయాన్ని ప్రత్యేకంగా వీడియో తీసి దాచుకోవడం పై కొంత మంది వాలంటీర్లు తో వీడియో తీయించుకున్న వ్యక్తి కూడా 12వ వార్డు గ్రూప్ లో పెట్టడంతో వాటిలో ఉన్న పార్టీ కార్యకర్తలు, ప్రజలు, ఇతర నాయకులు విపరీతమైన ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకొని ఇటువంటి వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం పట్ల ఎలా స్పందించాలో తెలీక మిగతా వైఎస్ఆర్సిపి నాయకులు తలలు పట్టుకుంటున్నారు.

# కరోనా నియంత్రణకు హోమియో అత్యవసరం

- సీనియర్ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ గంటా రాజేంద్రప్రసాద్ ముఖ్యమంత్రికి వినతి పత్రం



విశాఖపట్నం : ఒక నెల కాలముగా అనుహ్యంగా పెరుగుతున్న కరోనా కేసుల దృష్ట్యా హోమియో వైద్యాన్ని కూడా వాడితే మరింత ఎక్కువగా నియంత్రించగలమని విశాఖకు చెందిన సీనియర్ హోమియో వైద్య నిపుణులు డాక్టర్ గంటా రాజేంద్ర ప్రసాద్ తెలియజేస్తూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఒక వినతి పత్రాన్ని పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ ప్రజలను గడగడ వణికిస్తున్న కరోనా మహమ్మరి ప్రజలందరిని భయందోళనలకు గురి చేస్తుందని, కొన్ని వైద్య విధానాలతో వైద్యులు చాలావరకు కరోనాను నియంత్రించగలిగారని తెలిపారు. కానీ ఒక నెల కాలముగా అనుహ్యంగా పెరుగుతున్న కరోనా కేసుల దృష్ట్యా హోమియో వైద్యాన్ని కూడా వాడితే మరింత ఎక్కువగా నియంత్రించగలమని విశాఖపట్నం నందలి సీనియర్ హోమియో వైద్య నిపుణులు డా ? గంటా రాజేంద్ర ప్రసాద్ అభిప్రాయపడ్డారు. తనకున్న 35 సంవత్సరాల అనుభవంతో ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో హోమియో వైద్యాన్ని కూడా అనుసంధానిస్తే మరింత మెరుగైన చికిత్సలతో సత్ఫలితాలు పొందవచ్చన్నారు. తొలిదశలో ఎదుర్కొనే వ్యాధి లక్షణాలు జలుబు , వాసన , రుచులు కోల్పోవడం , గొంతు నొప్పి, జ్వరం, పొడిదగ్గు మొదలగు లక్షణాలకు హోమియో చికిత్స ద్వారా నయం చేసి, తదుపరి క్లిష్ట దశలైన విపరీతమైన దగ్గు, ఆయాసం మొదలగు అత్యవసర పరిస్థితులకు లోనవ్వ కుండా నిరోధించ వచ్చునని తెలిపారు. ఈ క్రొత్త వ్యాధి కోవిడ్ -19 కోసం హోమియోలో క్రొత్త మందు కనిపెట్టనవసరం లేదన్నారు. సుమారు 200 సంవత్సరాల క్రితం హోమియో సృష్టికర్త డా.శామ్యూల్ హానిమన్ కనిపెట్టిన మందులనే ఈతరం వైద్యులు అన్ని రకాల వ్యాధి లక్షణాలకు ఉపయోగి స్తున్నట్లు తెలిపారు. మరో 200 సం॥ల తరువాత వచ్చే క్రొత్త వ్యాధికి కూడా ఈ మందులతోనే నయం చేగలరని తెలిపారు. గతంలో పలు వైరస్ జ్వరాలకి హోమియో మందునే వ్యాక్సిన్ రూపంలో వాడి నియ ంత్రించారని, ప్రస్తుత కరోనాకి ఢిల్లీ సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ రిసెర్చ్ ఇన్ హోమియోపతి సూచించిన ఆర్సనికమ్ ఆల్బమ్ ను కరోనా వ్యాధి నిరోధక హోమియో మందుగా పంపిణీ చేసి కొంత వరకు నిరోధించి నిర్వ హించినట్లు తెలిపారు. దేశంలోని హోమియో వైద్యులకు గత నాలుగు నెలలుగా 'కరోనా రోగ లక్షణాలు మరియు హోమియో చికిత్సలు' అనే అంశాలు పై దేశ , విదేశాలలోని నిష్ణాతులైన హోమియో వైద్యులచే , వారి క్లినికల్ ట్రయల్స్ ఆధారంగా వెబి నార్ల ద్వారా ఆన్ లైన్ విడియో లెక్చర్స్ నిర్వహించి నైపుణ్యమైన హోమియో చికిత్సా విధానాలతో ప్రత్యేక శిక్షణలను అందించినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్య దృష్ట్యా మన ముఖ్యమంత్రి, సంబంధిత అధికారులు స్పందించి హోమియో వైద్యాన్ని ప్రోత్సహించాలని , కరోనా వ్యాధి నియంత్రణలో భాగంగా చర్యలు తీసుకొని తగు ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. దశబ్దాల మేర హోమియో వైద్యాన్నే నమ్ముకున్న వారికి, ప్రస్తుతం కరోనా సోకినవారు ఇతర వైద్యాలను ఆశ్రయించ లేక మాపై ఒత్తిడి ఉన్న తెస్తున్న పరిస్థితుల్లో వారికి హోమ్ క్వారంటైలో హోమియో సేవలందించుటకు ప్రభుత్వ అధికారిక అనుమతుల కొరకు హోమియో వైద్యులు వేచి చూస్తున్నారని తెలిపారు. ఈ మధ్య మహారాష్ట్రలోని పూణే నగరం నందలి మునిసిపల్ అధికారులు ప్రైవేట్ హోమియో వైద్యులకు తొలిదశ (మైల్డ్,మోడరేట్) కరోనా కేసుల చికిత్స జరుపుటకు అనుమతించినట్లు తెలిపారు.

## సీఆర్పీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా

# విద్యావేత్త డాక్టర్ సీతారామకృష్ణ నియామకం



విశాఖపట్నం : ఛైల్డ్రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం(సీఆర్పీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా (సైకాలజీ) నగరానికి చెందిన ప్రముఖ విద్యావేత్త,సైకాలజిస్ట్,వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ ఎన్.సీతారామ క్రిష్ణ నియమితు లయ్యారు,ఈ నియామక పత్రాన్ని బుధవారం సీతమ్మ ధార లో జరిగిన కార్యక్రమంలో ఎ.పి.ఈ. పి.డి.సి.ఎల్,.సి.జి.ఆర్ ఎఫ్.చైర్ పర్సన్,మాజీ న్యాయమూర్తి డి.ధర్మారావు, ఫోరం రాష్ట్ర అధ్య క్షుడు డాక్టర్ గొండు సీతారాం ల చేతుల మీదుగా సీతారామ కృష్ణకు నియామక పత్రం అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తి ధర్మారావు మాట్లాడుతూ బాలల హక్కుల సంక్షేమం కోసం రాష్ట్రంతో పాటు ప్రధానంగా ఆర్థిక రాజధానిగా వెలుగొందుతున్న మహా విశాఖ నగరంలో సీఆర్పీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం నేతృత్వంలో నిత్యం కృషి చేస్తుండడం అభినందనీయం అన్నారు. సీతారామ కృష్ణారావు నగరం లో మంచి విద్యా వేత్తగా,పి. హెచ్,డి తో కలిపి 16 పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీలు,ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి గోల్డ్ మెడల్,పలు రాష్ట్ర,జాతీయ అవార్డులు పొందడమే కాకుండా కొన్నేళ్లుగా బాలలు, దివ్యాంగులు, ఇతర బాలల మానసిక తత్వవేత్త గా పేరు ప్రతిష్టలు కలిగి ఉన్న ఈయన నియామకం తో రాష్ట్రంలో బాలలకు సీఆర్పీఎఫ్ మరింత దగ్గరయ్యే ప్రయత్నం చేస్తున్నారని అభినందించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గొండు సీతారాం మాట్లాడుతూ తమ ఫోరం బాలల మనసులను స్వంతం చేసుకొనే ఏకైక లక్ష్యంతో డాక్టర్ సీతారామ క్రిష్ణ వంటి మహోన్నత విద్యావేత్త, ప్రముఖ సైకాలజిస్ట్,వ్యక్తిత్వ వికాస నిపుణుడు నియామకం ఆవశ్యకత తో అడుగులు వేసామన్నారు.ఈ నియా మకంతో రాష్ట్ర వ్యాప్తంగా బాలలకు శత శాతం ఉప యుక్తంగా ఉండే సదస్సులు, అవగాహన కార్యక్రమాలు, నిర్వ హణకు ప్రణాళిక రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ ఎఫ్ జిల్లా సైకాలజీ విభాగం అధ్యక్షుడు డాక్టర్ కె.జగ్గారావు,ఫోరం రూరల్ జిల్లా అధ్యక్షుడు బాకా లవకుశ తదితరులు పాల్గొన్నారు.

# మనం - మన పరిశుభ్రత పని తీరుపై ఆరా



దేవరాపల్లి : మండలంలో మనం-మనపరిశుభ్రత అనే కార్యక్రమం పనితీరుపై డి ఎల్ పి ఓ టి.కొండలరావు అరా తీశారు. మండలంలోని దేవరాపల్లి, తెనుగుపూడి, కలిగోట్ల పంచాయితీల్లో బుధవారం ఆయన పర్యటించారు. పంచాయతీలో ఈ కార్యక్రమం సక్రమంగా అమలు అవుతుంది లేనిది అన్న విషయాలను గూర్చి ఈ ఓపిఆర్ డి ఎం. రాధిక సమక్షంలో పంచాయతీ కార్యదర్శితో సమీక్ష సమా వేశం ఏర్పాటు చేశారు. అనంతరం సంపదతయారీ కేంద్రాలను సందర్శించారు.

తడి, పొడి, చెత్తను వేరు చేసే విధానం పరిశీలిం చారు. పంచాయితీల్లో అపరిశుభ్రతకుకి తావివ్వ కుండా స్వచ్ఛ పంచాయతీలుగా తీర్చిదిద్దు కోవాలని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో దేవరాపల్లి పంచాయతీ కార్యదర్శి ఎల్. లింగన్న, సచి వాలయం సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# దయనీయ స్థితిలో ఫోటోగ్రాఫర్లు

- ప్రభుత్వం పెద్ద మనసుతో ఆదుకోవాలి
- ఫోటోగ్రాఫర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బొంగరాల సురేష్


విలేకరులతో మాట్లాడుతున్న ఫోటోగ్రాఫర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ - బొంగరాల సురేష్

చోడవరం : ఫోటోగ్రఫీ వృత్తిలో పనిచేస్తున్న గ్రాఫర్లు ప్రస్తుతం దయనీయమైన పరిస్థితిలో ఉన్నారని, ప్రభుత్వం పెద్ద మనసు చేసుకొని అధికంగా చేయూతనిచ్చి ఆదుకోవాలని ఫోటోగ్రాఫర్స్ యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బొంగరాల సురేష్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని చోడవరం - మాడుగుల నియోజకవర్గాల యూనియన్ సభ్యులతో కలిసి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ సెక్రెటరీ కుప్పిలి అప్పల స్వామి తో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కరోనా మహమ్మారి కారణంగా వివాహాలు, ఇతర ఒక కార్యాలు లేక ఫోటోగ్రాఫర్లకు పని లేకుండా పోయిందన్నారు. దీంతో గత ఆరు నెలలుగా ఆర్థికంగా ఫోటో గ్రాఫర్లు కొట్టుమిట్టాడుతున్నారు.

ప్రభుత్వం వివిధ రంగాల వారికి ఆర్థిక చేయూతనిచ్చింది అని, ఫోటోగ్రాఫర్లకు కూడా ఏదో ఒక రూపంలో చేయూతను అందించాలని కోరారు.

ఫోటో గ్రాఫర్లకు కార్మిక చట్టాలను వర్తింపజేయడం మే కాకుండా, వారివారి వృత్తులకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసుకునేందుకు రాయితీపై రుణాలు అందించి చేయూతను అందించాలన్నారు. అలాగే ఇల్లు లేనివారికి స్థలాలు ఇవ్వాలని, గృహాలు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.

# మట్టి గణపతి ప్రతిమలనే..పూజించాలి..

- కరోనా నేపథ్యంలో.. ఇంట్లోనే.. గణపతికి పూజలు
- వీధుల్లో గణపతి విగ్రహాలు, పూజలు వద్దు.. వివేకానంద సంస్థ విజ్ఞప్తి



విశాఖపట్నం : అందరూ మట్టి గణపతి ప్రతిమలనే పూజించాలని.. వివేకానంద సంస్థ ప్రజలకు పిలుపు నిచ్చింది. కరోనా నేపథ్యంలో.. ప్రతీ ఒక్కరూ సామాజిక బాధ్యతగా ఇంట్లోనే గణపతికి పూజలు నిర్వహించాలని సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు కోరారు. కరోనా విజృంభిస్తోన్న..ఈ ప్రమాదకర పరిస్థితుల్లో వీధుల్లో గణపతి విగ్రహాలు పెట్టి.. పూజలు చేయవద్దని ప్రజలందరికీ విజ్ఞప్తి చేశారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు వివేకానంద సంస్థలో మట్టి విగ్రహాలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మహిళా సభ్యులు సుజాత, వెంకటి, భవాని, ఉమాదేవి, సావిత్రి పాల్గొన్నారు.

# నాగన్నదొరపాలెంలో ఈ క్రాప్ నమోదు



ఈ క్రాప్ నమోదు చేస్తున్న దృశ్యం

గొలుగొండ : గొలుగొండ మండలం నాగన్నదొరపాలెం గ్రామంలో బుధవారం రెవెన్యూ అధికారి నర్సింగ రావు ఆధ్వర్యంలో ఈ క్రాప్ నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. ఈ క్రాప్ యొక్క ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో పడాల్, హార్టికల్చర్ సిబ్బంది, విఆర్ఎ రాజు, రైతులు పాల్గొన్నారు.

### కనకదుర్గమ్మవారి ఆలయంలో

# ఘనంగా లలితా సహస్రహోమం



అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్య క్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్య నారాయణ స్వామివారి తొలిపావాంచ వద్ద కొలువైయున్న కనకదుర్గమ్మవారి ఆలయంలో అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం లలితా సహస్రహోమం అత్యంత ఘనంగా జరిగింది.ఉదయం 10 గంటలకు పండితులు గణపతి పూజతో కార్యక్రమాన్ని ప్రారంభించి అనంతరం హెూమ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.11 గంటలకు పూర్ణహుతి నిర్వహించారు. వేద పండితులు వేదాశీస్సులు అనంతరం భక్తులకు తీర్ధ, ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సుపరింటెండెంట్ లక్ష్మణ స్వామి, సీనియర్ అసిస్టెంట్ పోల్నాటి లక్ష్మీనారాయణ తది తరులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు ప్రయాగ రాంబాబు, చల్లపల్లి ప్రసాద్ శర్మ, కొంపెల్ల.మూర్తి తదితరులు నిర్వహించారు.

# వేచలంలో పాజిటివ్ కేసులు నమోదు

- 43 మందికి కరోనా టెస్టులు



దేవరాపల్లి : మండలంలోని వేచలం పి హెచ్ సి పరిధిలో బుధవారం మరో మూడు పాజిటివ్ కేసులు నమోదైనట్లు వైద్యాధికారి బి. హారిక తెలిపారు. బోయిలకింతాడ గ్రామానికి చెందిన 50 ఏళ్ల వ్యక్తికి అలాగే 25 ఏళ్ల యువకుడు, కొత్తపెంట గ్రామంలో 20 ఏళ్ల మహిళ కు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయినట్లు ఆమె అన్నారు. దీంతో పీ హెచ్ సి పరిధిలో మొత్తం 21 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని అన్నారు. అలాగే ఇటీవలే మరో కొంతమందికి కరోనా టెస్ట్ లు నిర్వహించామని వాటి ఫలితాలు రావాల్సి ఉందని అన్నారు. అలాగే దేవరాపల్లి పి.హెచ్.సి పరిధిలో దేవరాపల్లి గ్రామానికి చెందిన 43 మందికి కరోనా వైద్య పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారిణి ఎస్. లలిత అన్నారు. ఈనెల 12వ తేదీన నిర్వహించిన కరోనా వైద్య పరీక్షలు సంబంధించిన ఫలితాలు రావాల్సి ఉంది అన్నారు.

# వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### రాజేంద్రపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి ధీరజ్




వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యూరు : వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాజేంద్రపాలెం పిహెచ్‌సి వైద్యాధికారి ధీరజ్ అన్నారు. రాజేంద్రపాలెంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులను పరీక్షించి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి ధీరజ్ మాట్లాడుతూ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధులు సక్రమించకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కరోనా వైరస్ నేపథ్యంలో అందరూ భౌతిక దూరం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఏఎన్ఎం కుసుమమ్మ, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వైద్య సిబ్బందికి రక్షణ కవచాలు వితరణ

### జిల్లా కలెక్టర్‌కు అందజేసిన ఎన్ఆర్ఐ కుటుంబాలు



విశాఖపట్నం : కరోనా వైరస్ నుండి ప్రజలను రక్షిస్తూ నాలుగు నెలల నుండి అలుపెరగని పోరాటం చేస్తున్న వైద్యులు వైద్య సిబ్బంది కి నగరానికి చెందిన ఎన్ఆర్ఐ కుటుంబాలవారు మాస్కులు, ఫేస్ షీల్డ్ లు వితరణ చేశారు. రూ 15 లక్షలు విలువైన 75వేల మాస్కులు, 15 వేల ఫేస్ షీల్డ్ లను జిల్లా కలెక్టర్ వినయ్ చంద్ కు చీరాల శ్రీ రామ్ ప్రసాద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి వి సుధాకర్, అడిషనల్ డిఎంఅండ్హెచ్ఓ విజయలక్ష్మి, విమ్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉమేష్ కుమార్, మల్లికార్జున్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ మొదటి వారంలో వైయస్సార్ సంపూర్ణ పోషణ ప్రారంభం

- నర్సీపట్నం డివిజన్ లో 99 అంగన్వాడీల పోస్టుల భర్తీకి చర్యలు
- అంగన్వాడి కేంద్రాల్లో సౌకర్యాలు మెరుగు, బోధన కై శిక్షణ : పీడీ సీతామహాలక్ష్మి



నర్సీపట్నం : రాష్ట్ర వ్యాప్తంగా సెప్టెంబర్ ఒకటో తేదీన వైయస్సార్ సంపూర్ణ పథకం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారని ఐసిడిఎస్ పిడి సీతామహాలక్ష్మి విలేకరులకు వెల్లడించారు.నర్సీపట్నం డివిజన్ లోని ఖాళీగా ఉన్న 99 పోస్టులు భర్తీ చేసేందుకు సెప్టెంబర్ మొదటి వారంలో చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఆమెతో పాటు నర్సీపట్నం సిడిపిఓ రమణి కోట ఉరట్ల సిడిపిఓ కలిసి నర్సీపట్నం సబ్ కలెక్టర్ యన్.మౌర్య కి ఈ విషయాన్ని తెలిపారు . ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 4952 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి అన్నారు. 1753 సొంత భవనాలు ఉన్నాయన్నారు. 414 కేంద్రాలు స్కూలు పరిధిలో ఉన్నాయన్నారు. 42 కేంద్రాలు పంచాయతీ భవనాల్లో నూ, 448 భవనాలు అద్దె భవనాల్లో ఉన్నాయన్నారు. 2268 కేంద్రాలకు జిల్లాలో అద్దె చెల్లిస్తున్నట్లు ఆమె తెలిపారు. 1200 కేంద్రాలకు సంబంధించి నూతనంగా భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించాల్సి ఉందన్నారు. ఇందులో 420 కేంద్రాలు ప్రస్తుతం పని ప్రారంభించారని, సుమారు 650 కేంద్రాలు పనులు ప్రారంభిస్తారన్నారు.పట్టణ ప్రాంతాల్లో స్థల సమస్య ఉందని ఆమె అన్నారు. కోట ఉరట్ల ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం మరమ్మతులు విషయమై మండల పరిషత్ అభివృద్ధి అధికారి తో చర్చించడం జరిగిందన్నారు.

నర్సీపట్నంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయాన్ని వచ్చేనెల ప్రారంభించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. నాడు నేడు కార్యక్రమం లో భాగంగా అంగన్ వాడి కేంద్రాలు రూపు రేఖలన్నీ మారుతాయి అన్నారు. అన్ని సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ప్రీ ప్రైమరీ పాఠశాలకు సంబంధించి త్వరలో నియమనిబంధనలు వస్తాయని ఆమె అన్నారు.

# మామిడిపాలెంలో అక్రమ నిర్మాణాలు తొలగింపు





అనకాపల్లి : మండలంలో మామిడిపాలెం గ్రామంలో బుధవారం అక్రమ నిర్మాణం తొలగించారు. మామిడిపాలెం రెవెన్యూ పరిధి సర్వే నెంబరు 145లో ఉన్న ప్రభుత్వ స్థలం కొంత కాలంగా ఆక్రమణకు గురవుతుందని రెవెన్యూ అధికార్లకు అందిన ఫిర్యాదుల మేరకు స్పందించిన రెవెన్యూ అధికార్లు ఒక్కసారిగా ఆక్రమణదారులపై కొరడాను ఝుళిపించారు.

రూరల్ పోలీసుల సహకారంతో రంగంలోకి దిగిన రెవెన్యూ అధికార్లు ప్రొక్లయిన్‌లతో నిర్మాణాలను, పునాదులను తొలగించారు. దీంతో పలువురు ఆక్రమణదారులు అడ్డుకునే ప్రయత్నం చేసి అధికార్లతో వాదోపవాదాలకు దిగారు. అధికార్లు కొంత మంది అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తూ టార్గెట్ చేసిన నిర్మాణాలను మాత్రమే తొలగించడం అన్యాయమని ఆరోపించారు. సర్వే నెంబరు 145లో అనుమతులు లేకుండా చాలా నిర్మాణాలు ఉన్నాయని తొలగించాలనుకుంటే అన్నిటిని తొలగించాలని డిమాండ్ చేసారు. ఏళ్ల తరబడి గ్రామంలో నివాసముంటూ సొంత ఇళ్లు లేక ఇబ్బందులు పడుతూ కూలీ పనులు చేసుకుంటూ కూడబెట్టుకున్న సొమ్ముతో సెంటు స్థలంలో ఇంటి నిర్మించుకుంటున్న పేదలపై కక్ష సాధింపు చర్యలకు దిగడం దారుణమన్నారు.

అలాగైతే గ్రామంలో ఉన్న ప్రభుత్వ స్థలమంతటినీ అధికార్లు స్వాధీనం చేసుకోవాలని పట్టుబట్టారు. దీంతో డిప్యూటీ తహశీల్దార్ వెంకట్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని అన్నారు.

# ప్రతిభకు పట్టం... అంకిత ప్రతిభకు నీరాజనం

### భగవద్గీత వీడియోకు విశేష స్పందన



విశాఖపట్నం : సోషల్ మీడియాలో హల్చల్ చేస్తున్న అంకిత వీడియాలు.... భగవద్గీత, కరోనా స్తోత్రం తదితర వీడియోలకు విశేష స్పందన.... అంకితకు ప్రముఖుల ప్రశంసలు..... పువ్వు పుట్టగానే పరమళిస్తుందనే నానుడిని నిజం చేస్తూ 19 ఏళ్ల గంట అంకిత తన కళాప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహిస్తుంది. బాల్యం నుంచే కళలు పట్ల ఆసక్తి గల అంకిత విద్యార్థి దశలో పలు పౌరాణిక నాటకాలలో కీలక పాత్రలు చేస్తూ, ఆ పాత్రలకు న్యాయం చేస్తూ ఉత్తమ బాల నటిగా, విశాఖరత్న, కళియుగ హరిశ్చంద్రడు మరెన్నో పురస్కారాలను, ఎంతో మంది ప్రముఖల ప్రశంసలను అందుకుంది. తల్లి తండ్రులు గంట చంద్రశేఖర్, అపర్ణ దంపతుల ప్రోత్సాహంతో తనలో గల కళాతృష్ణకు మరింత పదును పెట్టింది. అటు కళారంగంతో పాటు మురళీనగర్ గాయత్రి విద్యామందిర్ స్కూల్లో ఎల్‌కేజీ నుండి పదవ తరగతి వరకు చదివి, భీమునిపట్నం ప్రభుత్వ కళాశాలలో పాలిటెక్నికల్ పూర్తి చేసి గాయిత్రి ఇంజనీర్ కళాశాలలో బిటెక్ రెండవ సంవత్సరం చదువుతూ ఇటు విద్యలోను తన ప్రతిభను చాటుతూ ఉత్తమ విద్యార్థిగా గుర్తింపు పొందింది. ఒక్క నటనకే పరిమితం కాకుండా పాటలు, పద్యాలు, పేరడి పాటలు పాడుతూ తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకుంది. అలాగే శాస్త్రీయ నృత్యం, వెస్ట్రన్ డ్యా న్సలో ప్రతిభను కనభరుస్తూ మంచి గుర్తింపు తెచ్చుకుంది. అంకిత చేసిన భగవద్గీత, కరోనా స్తోత్రం, దానవీరశూరకర్ణ చిత్రంలో సీనియర్ ఎన్టీయార్ "ఏమంటివి, ఏమంటివి" డైలాగు, జ్యూనియర్ ఎన్టీయార్ యమదొంగ చిత్రంలో చెప్పిన అదే డైలాగును మార్చి కరోనా పట్ల ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేస్తూ "ఆగాగు కరోనాచార్య దేవ ఏమంటివి ఏమంటివి" అనే వీడియోలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో హల్చల్ చేస్తున్నాయి. అంకితకు మరింత పేరును తీసుకు వస్తున్నాయి. ఇదివరకే ఇటువంటి వీడియోలు ఎన్నో చేసింది. ప్రస్తుతం భగవద్గీతపై చేసిన వీడియో సోషల్ మీడియాలో విస్తృతంగా దూసుకు వెళుతుంది. ఈ ఒక్క వీడియో ఫేస్బుక్ లో పలు గ్రూప్లో హల్చల్ చేస్తోంది. సుమారు 500మంది పైగా ఈ వీడియోను షేర్ చేయడం జరిగింది. పలువురు ప్రముఖులు సుమారు 200 మంది అంకిత ప్రతిభను కొనియాడుతూ మెసేజ్ లు కూడా చెయ్యడం జరిగింది. భగవద్గీత విశిష్టతను, గొప్పతనాన్ని ఈ వీడియోలో చక్కగా వర్ణించి చెప్పిన అంకితకు ప్రశంసలు వెలువెత్తున్నాయి. 2011లో అంకిత తన 11 ఏట 11వ నెల 11వ తేదీన విశాఖ ప్రేమసమాజంలో తాను ప్రదర్శించిన మొట్ట మొదటి నాటకం హరిశ్చంద్రలో హరిశ్చంద్రుడు కాటిసీను ప్రధాన పాత్ర పోషించి ఆహుతుల నీరాజనాలు అందుకొంది. తన ప్రతిభకు ఎన్నో అవార్డులు వెతుక్కుంటూ వచ్చాయి. రంగస్థల కళాకారులు ఐక్యసంఘం, శ్రీసాయి కళానికేతన్, శ్రీవాణి ఆర్ట్స్ పార్వతీపురం, శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయం, బొబ్బిలి కళాపరిషత్, విశాఖ రత్న కళాపరిషత్ వంటి సంస్థల ద్వారా అంకిత అనేక పురస్కారాలను అందుకొంది. విశాఖ మధురవాడ శిల్పారామంలో నిర్వహించిన పౌరాణిక నాటక పోటీల్లో హరిశ్చంద్ర నాటకంలో తాను చేసిన హరిశ్చంద్ర పాత్రకు ఉత్తమ నటిగా అవార్డును గెలుచుకొంది. అలాగే బొబ్బిలి రాజు సుజన రంగారావు, వైకాపా నాయకులు ద్రోణంరాజు శ్రీనివాస్, సినీ నటులు వంకాయల సత్యనారాయణ, కళ్ల చిదంబరం, నంది అవార్డు గ్రహీతలు బి ఎ నాయడు, బి వి నాయుడు, కెళ్ల గుండ్రెడ్డి బలరాం మాష్టారు. విజయ్ సారధి, మరియు రంగస్థల నటులు పాటిమీద కృష్ణమూర్తి, వంగల సూరినాయుడు, కాండ్రింగి రాములు, స్వర్గస్తులు గొరపిల్లి రాంబాబు, చిక్కాల కొదండ విద్యనేర్పిన గాయిత్రి స్కూల్ డైరెక్టర్ జగదీష్, ప్రిన్సిపాల్ ధర్మారావు, వంటి ప్రముఖులతో పాటు గురువులు నంది అవార్డు గ్రహీతలు ఇల్ల అప్పారావు, బి విజయసాయిలు అంకిత ప్రతిభను కొనియాడుతూ భవిష్యత్ లో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి అటు తల్లితండ్రులకు, ఇటు దేశానికి మంచి పేరు ప్రఖ్యాతులను తీసుకురావాలని కోరారు.

# అప్రమత్తతో సైబరు నేరాల నుండి మహిళలు రక్షణ పొందవచ్చును

**- విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారి, ఐపిఎస్**




విజయనగరం : రాష్ట్ర పోలీసుశాఖ, సిఐడి విభాగం మరియు సైబరు పీస్ ఫౌండేషను సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఈ రక్షాబంధన్ 4 ఎస్' కార్యక్రమంలో భాగంగా బుధవారం ప్రముఖ సైబరు నిపుణుల సహకారంతో 'మహిళలపై జరిగే సైబరు నేరాలు' అన్న అంశంపై వెబినార్‌ను నిర్వహించి, రాష్ట్ర ప్రజలకు, మహిళలు, విద్యార్ధులకు, ఉపాధ్యాయులకు మరియు సీనియర్ సిటిజన్స్‌కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ బి. రాజకుమారి మాట్లాడుతూ నిపుణుల సలహాల మేరకు మొబైల్స్, కంప్యూ టర్సు మరియు అకౌంట్ సెట్టింగ్సులో కొన్ని మార్పులు చేసి, జాగ్రత్తలు తీసుకొంటే మహిళలు సైబరు నేరాల నుండి రక్షణ పొందవచ్చునని జిల్లా ఎస్పీ అన్నారు. మహిళలే లక్ష్యంగా సోషల్ మీడియా వేదికగాను, ఆన్‌లైను సెక్సువల్, ఆర్ధిక నేరాలు నేడు ప్రధానంగా జరుగుతున్నాయన్నారు. కోవిడ్ లాక్‌డౌన్ కాలంలో సైబరు నేరాల సంఖ్య గతంలో కంటే కొంచెం పెరిగాయన్నారు. సాధారణంగా సైబరు నేరగాళ్ళు కుటుంబ బంధాలను, స్నేహాలను, ప్రతిష్టను చెడగొట్టేందుకు మహిళల ఫోటోలను మార్ఫింగు చేయడం, అకౌంట్స్ హ్యాకింగు చేయడం, క్లోనింగు చేయడం, ట్రోలింగు, స్టాకింగు, గ్రూమింగు, బుల్లీయింగు వంటి సైబరు నేరాలకు, గాసిప్స్‌ను సృష్టించి, మహిళలను వేధింపులకు గురి చేస్తారన్నారు. ఫేస్‌బుక్ అకౌంట్స్‌ను హ్యాకింగు చేసి, క్లోనింగు చేసి, నకిలీ అకౌంట్సును సృష్టించి, ఇబ్బందికరమైన పోస్టింగులను చేసి మన ప్రతిష్టను దిగజార్చుతారన్నారు. ఆన్‌లైను కొనుగోళ్ళు చేసే సమయంలో కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. చాలా వరకు నకిలీ వెబ్‌సైట్స్ ఉంటాయని, వీటి మీద క్లిక్ చేసినపుడు, మనకు తెలియకుండానే, మన వ్యక్తిగత సమాచారం సైబరు నేరగాళ్ళుకు చేరుతుందని, మరి కొన్నిసార్లు వైరస్ మన కంప్యూటర్లు, మొబైల్స్‌లోకి ప్రవేశించి, హ్యాకింగుకు గురవుతాయన్నారు. కావున, నమ్మదగిన సైట్స్ ద్వారానే ఆన్‌లైను కొనుగోళ్ళు చేయాలన్నారు. మొబైల్స్, కంప్యూటర్లును రిపేరుకు ఇచ్చే సమయంలో మన డేటాను పూర్తిగా క్లియర్ చేసిన తరువాతనే రిపేర్ చేసేందుకు ఇవ్వాలన్నారు. ఇతరులకంప్యూటర్లు, మొబైల్స్ వినియోగించే సమయంలో మన అకౌంట్స్ నుండి తప్పనిసరిగా లాగ్ అవుట్ అవ్వాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను పాస్‌వర్డ్సు, ఒటిపి నంబర్లును షేర్ చెయ్యవద్దన్నారు. మహిళలు ఎవ్వరైనా సైబరు వేధింపులకు గురైతే, ఫిర్యాదు చేసేందుకు సిఐడి విభాగంలోని 9071666667 నంబరుకు వాట్సాప్ చెయ్యవచ్చు లేదా 112 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందించవచ్చు లేదా మీకు స్థానికంగా ఉండే దిశ మహిళ పోలీసు స్టేషనుల్లో లేదా ఆన్‌లైను ఫిర్యాదు చెయ్యవచ్చునన్నారు. సిఐడి ఎస్పీ రాధిక జిఆర్, సైబరు నిపుణులు, డాక్ జాయింట్ డైరెక్టర్ శ్రీమతి ఇంద్రవేణి, సైబరు పీస్ ఫౌండేషను ప్రతినిధి ఐఎల్ నరసింగరావు పాల్గొని మహిళలు, విద్యార్ధులు, ఉద్యోగినులు, ఉపాధ్యాయులకు సైబరు నేరాల నుండి ఏవిధంగా రక్షణ పొందవచ్చును అన్న అంశం మీద అవగాహన కల్పించినట్లుగా జిల్లా ఎస్పీ శ్రీమతి బి.రాజకుమారి తెలిపారు.

# కోవిడ్ బాధిత జర్నలిస్టులకు కిట్లు



***- జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్***

విశాఖపట్నం : కోవిడ్ -19 కు గురి అయిన అక్రిడిటెడ్ జర్నలిస్టులకు బలవర్ధకమైన ఆహారము అవసరమని కావున వారికి కిట్లను అందజేయాలని జిల్లా కలెక్టర్ వి.వినయ్ చంద్ సమాచార శాఖ ఉపసంచాలకుడు వి.మణిరామ్ ను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టరు జర్నలిస్టుల కోసం కిట్లను కలక్టరేట్ లో సమాచార శాఖ ఉప సంచాలకులు వి.మణరామ్ కు అందజేశారు. ఆ కిట్ లో పల్స్ ఆక్సీమీటర్ - 1, బియ్యం -10 కేజీలు, కంది పప్పు -2 కేజీలు, పసుపు -½ కేజీ, నెయ్యి -¼ కేజీ, డ్రై ఫ్రూట్స్ - కేజీ, బెల్లం - 1 కేజీ, చోడిపిండి -1 కేజీ మొత్తం 8 వస్తువులు ఉంటాయని తెలియజేశారు. సదరు కిట్ లను కోవిడ్ పాజిటివ్ వచ్చిన జర్నలిస్టులకు అందజేయాలన్నారు. కోవిడ్ పాజిటివ్ వచ్చిన జర్నలిస్టులు వారి పాజిటివ్ రిపోర్ట్, అక్రిడిటేషన్ జెరాక్సులను డిడి కార్యాలయములో పి.ఆర్.వో వెంకటరాజు గౌడ్ (సెల్ నెం: 9121215255) ను సంప్రదించాలని కోరడమైనది.

# సేవలు అందించండి - మన్ననలు పొందండి




శ్రీకాకుళం : కరోనా వైరస్ భారిన పడిన వారికి మంచి సేవలు అందించి మన్ననలు పొందాలని పీజీ వైద్యులను జిల్లా కలెక్టర్ జె నివాస్ కోరారు. కరోనా చికిత్సలో పాల్గొననున్న పిజి వైద్యుల శిక్షణా కార్యక్రమం ప్రభుత్వ వైద్య కళాశాలలో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ నివాస్ ప్రసంగిస్తూ వైద్యులలో ఉత్సాహాన్ని నింపారు. వైద్య వృత్తి గొప్ప వృత్తి అని అందులో ప్రవేశించి ప్రజలకు సేవ చేయడం ఎంతో ఉత్తమమైనది అన్నారు. ప్రస్తుత తరుణంలో కరోనా పేషెంట్ లకు చికిత్స అందించడం మహోన్నతమైనటువంటి సేవ అని ఆయన చెప్పారు. వైరస్ భారీన పడినవారిలో ఆత్మస్థైర్యం పెంపొందించాలని పిలుపునిచ్చారు. మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ ద్వారా చికిత్స పొందుతున్న వారిలో నమ్మకం కలిగించ వచ్చని, వ్యాధి తగ్గి త్వరలోనే ఇంటికి వెళ్తారు అనే ధైర్యాన్ని నింపాలని కలెక్టర్ సూచించారు. తద్వారా వైద్యానికి బాగా స్పందించి త్వరగా కొలుకుంటారని అన్నారు. చేస్తున్న పనిలో పూర్తి అంకితభావం ఉండాలని, ఆ విభాగంలో నాయకత్వం వహించాలని కలెక్టర్ కోరారు. మీరు కల్పించే చిన్న ప్రేరణ ఎంతో స్ఫూర్తిని కలిగిస్తుందని అన్నారు. ఆసుపత్రికి తీవ్ర పరిస్థితిలో వచ్చిన పేషెంట్లకు తక్షణం చేయూతనందించి వారికి వైద్య సేవలు అందించాలని అన్నారు. వచ్చిన పేషెంట్ ను సక్రమంగా రిసీవ్ చేసుకోవడం ద్వారా ఆ వ్యక్తిలో రుగ్మత సగం తగ్గిపోతుందని పేర్కొన్నారు. వైద్య వృత్తి పట్ల, వ్యవస్థ పట్ల నమ్మకం కలుగుతుందని చెప్పారు. ఆసుపత్రుల్లో వైద్యసేవలు అందడం లేదని, సరైన సౌకర్యాలు కల్పించడం లేదని వస్తున్న పుకార్లకు ఫుల్ స్టాప్ పెట్టాల్సిన బాధ్యత మీపై ఉందని కలెక్టర్ కోరారు. యువ వైద్యుల చేరికతో శ్రీకాకుళం వైద్య వ్యవస్థ భలోపితం అయినట్లు భావిస్తున్నానని, రానున్న రోజుల్లో మంచి మార్పులు చూడగలమని ఆశిస్తున్నట్లు చెప్పారు.

**కంట్రోల్ రూం తనిఖీ**

జిల్లా కలెక్టర్ నివాస్ వైద్య కళాశాలలో గల సర్వజన ఆసుపత్రి కోవిడ్ వైద్య సేవల విభాగం కంట్రోల్ రూమ్ ను తనిఖీ చేశారు. ఏ విభాగంలో ఏ విధమైన సేవలు అందుతున్నది పరిశీలించారు. ప్రతి బెడ్ వారీగా అందుతున్న సేవలు పరిశీలించారు. ఈ కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్లు సుమిత్ కుమార్, ఆర్.శ్రీరాములు నాయుడు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏ.కృష్ణ వేణి, సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకులు డా.ఏ.కృష్ణ మూర్తి, ఆర్.ఎం.ఓ డా.ఆర్.అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# జెర్సీ వేసుకొని రాత్రంతా ధోనీ ఏడ్చాడు!



ఇంటర్‌నెట్ డెస్క్: అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఎంఎస్ ధోనీకి టీమ్‌ఇండియా సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ శుభాకాంక్షలు తెలియజేశాడు. దేశ క్రికెట్‌కు అతడెంతో సేవ చేశాడని ప్రశంసించాడు. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే మహీ కొన్నిసార్లు భావోద్వేగానికి గురవుతాడని తెలిపాడు. టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు ప్రకటించిన రోజు టీమ్‌ఇండియా జెర్సీ ధరించి కన్నీరు కార్చాడని వివరించాడు. తన యూట్యూబ్ ఛానల్‌లో యాష్ మాట్లాడాడు. '2014లో మహీ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలకడం నాకు గుర్తుంది. మెల్‌బోర్న్‌లో మ్యాచ్‌ను కాపాడేందుకు ఆ రోజు మేమిద్దరం ఎంతో కష్టపడ్డాం. కానీ మేం ఓడిపోయాం. అప్పుడతను స్టంప్ తీసుకొని ఇక నేను ముగించేస్తున్నా అని సాధారణంగా చెప్పాడు. అదో భావోద్వేగ సన్నివేశం. నేనూ, సురేశ్ రైనా, ఇషాంత్ శర్మ సాయంత్రం మహీ గదిలోనే కూర్చున్నాం. ఆ రాత్రంతా అతడు టీమ్‌ఇండియా జెర్సీలోనే ఉన్నాడు. కన్నీరు కార్చాడు' అని అశ్విన్ తెలిపాడు. మహీతో తనకు ఎన్నో మరుపురాని సంఘటనలు ఉన్నాయని యాష్ అన్నాడు. చెపాక్‌లో భారత్-వెస్టిండీస్ టెస్టు మ్యాచ్ జరిగేటప్పుడు తొలిసారి ధోనీని కలిశానన్నాడు. అప్పుడు నెట్‌బౌలర్‌గా ఉన్నానని పేర్కొన్నాడు. 2008లో చెన్నై సూపర్‌కింగ్స్‌లో చేరానని తెలిపాడు. అతడి వద్ద చాలా సమయం గడిపి ఎంతో నేర్చుకున్నానని వివరించాడు. 2010 ఛాంపియన్స్ లీగ్‌లో మహీ తనకో ముఖ్యమైన పాఠం చెప్పాడని అన్నాడు. 'విక్టోరియా బస్‌రేంజర్స్‌తో మ్యాచులో నేను సూపర్ ఓవర్ వేశాను. అప్పుడు ఎంఎస్ నా దగ్గరికొచ్చి ఒత్తిడిలో నేను అత్యుత్తమంగా బంతులు వేయలేదని చెప్పాడు. క్యారమ్ బంతిని ఎక్కువగా ఉపయోగించాలని సలహా ఇచ్చాడు' అని యాష్ గుర్తు చేసుకున్నాడు. అలాగే 2013 ఛాంపియన్స్ ట్రోఫీ సమయంలో తాను వికెట్లు తీయకున్నా ఎంతో ప్రోత్సహించాడని తెలిపాడు. ఓ పక్క జడేజాకు వికెట్లు పడుతున్నా.. నీ బౌలింగ్ విధానం, ఆలోచనా విధానం బాగుందని ఇలాగే కొనసాగాలని అండగా నిలిచాడని అశ్విన్ పేర్కొన్నాడు.

# సందేశాత్మక చిత్రాలకు ప్రేక్షక ఆదరణ ఉంటుంది

**- మిస్టర్ లోన్లీ పోస్టర్ విడుదల చేసిన లాకెడ్ ఔట్ రెస్టో కేఫ్ సిబ్బంది**




విశాఖసిటీ : సమాజంలో జరుగుతున్న అనేక అంశాలను క్రోడీకరించి సందేశం తో కూడుకున్న సినిమాలకు ప్రేక్షకుల ఆదరణ ఎప్పుడూ లభిస్తుందని లాకెడ్ ఔట్ రెస్టో కేఫ్ సిబ్బంది అన్నారు.. బుధవారం నగరంలో రాంనాగర్ లో గల హొటల్ని లో ఎస్.కే.ఎమ్.ఎల్ బ్యానర్ పై రూపొందించిన మిస్టర్ లోన్లీ సినిమా టీమ్ సందర్శించారు.

అనంతరం చిత్రం పోస్టర్ ఓపెన్ చేశారు..ఈ సందర్భంగా చిత్ర నిర్మాత కాండ్రేగుల ఆదినారాయణ మాట్లాడుతూ ఈ సినిమా చిత్రీకరణ ఇప్పటికే పూర్తి కావచ్చిందన్నారు. పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురా బోతున్నామని చెప్పారు. మూడు దశల్లో సాగే ఈ సినిమా తప్పకుండా యువత ను ఆకట్టు కుంటుంది అన్నారు,,, ఖర్చుకు వెనుకాడకుండా ఈ సినిమాను చిత్రీకరించామన్నారు. నటీనటులు అద్భుతంగా రాణించారని తప్పకుండా ప్రేక్షకులు ఆదరిస్తారనే నమ్మకం తమకు ఉందన్నారు.

దర్శకుడు హరీష్ కుమార్ ముఖి మాట్లాడుతూ ఇది యువతకు సంబంధించిన సినిమా అన్నారు, తాము ఆశించిన దానికంటే బాగా వచ్చిందిఅని తెలిపారు..అనంతరం హొటల్లో లభ్యమయ్యే రుచిగల ఫుడ్ ని మిస్టర్ లోన్లీ టీమ్ భుజించి రుచి అమోఘం అని కొనియాడారు.

కార్యక్రమంలో నటీనటులు నురజ్,లోహిత,కెమెరామెన్ ఆనంద్ గరా ఎడిటర్ సాయిరాం తదితరులు హాజరయ్యారు.

# గిరిజన ప్రాంతాలు నాన్ షెడ్యూల్ ప్రాంతంలో కలిపితే ఊరుకునేది లేదు

**ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామరావు దొర**



అరుకులోయ : ఐదో షెడ్యూల్ ప్రాంతాన్ని ఒక్క ఇంచు కూడా నాన్ షెడ్యూల్ ప్రాంతంలోకి వెళ్లకుండా చూడవలసిన బాధ్యత ఆదివాసీ ప్రజాప్రతినిధులపై ఉందని ఆదివాసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రామారావు దొర, జిల్లా కోకన్వీనర్ కూడా రాధాకృష్ణ, డిమాండ్ చేసారు. వారు విలేకరులతో మాట్లాడుతూ కొయ్యూరు మండలంలో బాలారం, కంతారం, ఆడాకుల, ఆర్. కొత్తూరు గ్రామాలు షెడ్యూల్డ్ గ్రామలైనందున మైదాన ప్రాంతంలో కలిపితే స్థానిక ఆదివాసులు తీవ్రంగా నష్టపోయి తమకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులు కోల్పోతారని వారన్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా పై గ్రామాలను నాన్ షెడ్యూల్డ్ ప్రాంతమైన గోలుగొండ మండలంలో విలీనం చర్యాలంటూ ఆదివాసీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి (పాడేరు) ని, కొద్దిమంది గిరిజనేతరులు కోరడం విడ్డురంగా ఉందన్నారు. ఇప్పటికే ఆయా గ్రామాలలో ఆసులైన ఆదివాసిలకు దక్కవలసి రాజ్యాంగ ఫలాలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బోగస్ గిరిజనులు అనుభవిస్తున్నారు. ఆ గ్రామాలు నాన్ షెడ్యూల్ ప్రాంతంలోకి మారితే ఆ ప్రాంతంలో ఆదివాసిలకున్న కొద్దిపాటి భూమీ పరాయికరణకు గురయ్యే అవకాశం ఉందని, బాలారం వంటి గ్రామాల్లో గత ప్రభుత్వాలు లోపాయికారిగా జారీచేసిన ఇల్లా పట్టాలు రద్దు చేయవలసి ఉందని గుర్తుచరసారు. జిల్లాల పువవస్థీకరణ సమయంలో షెడ్యూల్డ్ ప్రాంతాలు విచ్చిన్నం కాకుండా కాపాడుకోవలసిన బాధ్యత ఆదివాసి ప్రజాప్రతినిదులు, మేధావులు, ప్రజలపై ఉందన్నారు. గతంలో జరిగిన పొరపాట్లను పునరావృతం చేస్తూ షెడ్యూల్డ్ గ్రామలను నాన్ షెడ్యూల్ ప్రాంతంలోకి కలపాలనే ఆలోచనలు చేస్తే ఆదివాసి జేఏసీ మరోఉద్యమానికి సిద్ధం కావలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

కొంతమంది గిరిజనేతరులు స్వార్థపూరితంగా, గొలుగొండ మండలం కేతవరం మండలాలలో, ఆదివాసీ గ్రామాలు విలీనం చేయమని అడగడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని, విలీనం చేస్తే ఆదివాసుల భూములను బలవంతంగా లాగేసుకొని, ఆ ప్రాంతం నుండి ఆదివాసులను వెళ్ళగొట్టే కుట్రలు పన్నుతున్నారని, ఆదివాసీల గ్రామాలు, భూముల జోలికొస్తే ఆదివాసి జేఏసి చూస్తూ ఊరుకునే ప్రసక్తి లేదని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

# నేటి నుండి ఐటిఐల ప్రవేశాల దరఖాస్తులు విక్రయం

శ్రీకాకుళం : ప్రభుత్వ, ప్రైవేటు ఐటిఐలలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫకేషన్ జారీ చేసిందని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ మరియు జిల్లా కన్వీనర్ రాడ కైలాసరావు తెలిపారు. ఈ మేరకు బుధ వారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఐటిఐలలో ఇంజనీరింగు, ఇంజినీరింగేతర ట్రేడ్లలో ప్రవేశాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. దరఖాస్తులను ఈ నెల 20వ తేదీ నుండి విక్రయిస్తున్నామని, ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

## నిత్య అన్నదాన పధకానికి రూ.1,00,000/- విరాళం

అన్నవరం : తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పధకానికి విశాఖపట్నం కు చెందిన ఎన్ సాయి సంపత్ రాయుడు రూ. 1,00,000/- విరాళమును దేవస్థానం సీనియర్ అసిస్టెంట్స్ పెద్దింటి.తలుపులయ్య,గంటా. విష్ణు లకు అందజేసి దీనిపై వచ్చు వడ్డీతో ప్రతీ సంవత్సరం నవంబర్ 23వ తేదీన అన్నదానం జరిపించవలసినదిగా కోరారు.

# ఇగ్నో అడ్మిషన్ల గడువు పెంపు

**- జూలై 2020 విద్యా సంవత్సరానికి ఆగస్టు 31 వరకు ప్రవేశాలు**
**- ఆన్‌లైన్ విధానం ద్వారా ప్రవేశాలు**
**- ద్వితీయ, తృతీయ సంవత్సరాల ప్రవేశాలు కూడా...**

విశాఖపట్నం : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో జూలై 2020 విద్యాసంవత్సరానికి గానూ వివిధ దూరవిద్యా కోర్సులతోపాటూ ఆన్లైన్ కోర్సులలో ప్రవేశాల కోసం గడూవును ఆగస్టు 31 వ తేదీ వరకు పెంచింది. ఈ మేరకు విశ్వవిద్యాలయం ఒక ప్రకటన జారీ చేసింది. ఇప్పటికే అందుబాటులో ఉన్న కోర్సులతోపాటు మొత్తం 13 ఆన్లైన్ కోర్సులకు, సుమారు 180 దూరవిద్యాకోర్సులకు అడ్మిషన్లు జోరుగా కొనసాగుతున్నాయి. అన్ని రకాల సర్టిఫికేట్, డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, పి.జి కోర్సులలో ప్రవేశాలకు ఆగస్టు 31 వరకు అడ్మిషన్లు ఆన్ లైన్ ద్వారా పొందే వీలుంది. ఇగ్నో వెబ్సైట్ లో ఉన్న అడ్మిషన్ల లింక్ ద్వారా లేదా కింద ఇవ్వబడిన లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చు. https://ignouadmission.samarth.edu.in కొత్త ప్రవేశాలతో పాటు ఇదివరకు ఇగ్నో డిగ్రీ, పి.జి. కోర్సుల్లో ప్రవేశాలు పొంది ఇప్పుడు ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో చేరగోరేవారుకూడా ఆగస్టు 31 వరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేయవచ్చు. విశాఖపట్నం ప్రాంతీయకేంద్రం పరిధిలోని 5 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నిటిలో ఈ విద్యా సంవత్సరానికిగానూ ప్రవేశాలు పొందే వీలుంది.

ప్రవేశాలన్నీ ఆన్లైన్ విధానంద్వారా మాత్రమే అందుబాటులో ఉంటాయి. ఫీజులు కూడా ఆన్లైన్ ద్వారానే కట్టాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన కోర్సులలో ఎస్ సి., ఎస్.టి. విద్యార్థులకోసం పూర్తి ఫీజు రాయితీకూడా విశ్వవిద్యాలయం కల్పిస్తోంది. మరిన్ని వివరాలకోసం ఇగ్నో వెబ్సైట్ చూడవచ్చు లేదా ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని ఈమెయిలు ద్వారా సంప్రదించవచ్చు.

# అవును! నేనూ కరోనా బారిన పడ్డా

## గాయని సునీత



హైదరాబాద్: గాయని సునీత కరోనా బారిన పడ్డారట. ఈ విషయాన్ని ఆమె స్వయంగా వెల్లడించారు. చాలా స్వల్ప లక్షణాలు ఉండటంతో స్వీయ నిర్బంధంలోకి వెళ్లినట్లు తెలిపారు. ఇప్పుడు తాను కోలుకున్నానని వెల్లడించారు. ఈ మేరకు వీడియో సందేశాన్ని అభిమానులతో పంచుకున్నారు. "అందరికీ నమస్కారం. నా ఆరోగ్యం గురించి బంధువులు, స్నేహితులు, మీడియా నుంచి వరుస ఫోన్ కాల్స్ వస్తున్నాయి. దీనిపై స్పష్టత ఇచ్చేందుకే మీ ముందుకు వచ్చా. కొన్ని రోజుల కిందట నేను కరోనా బారిన పడ్డా. ఒక షూటింగ్‌కు వెళ్తే తలనొప్పిగా అనిపించింది. అశ్రద్ధ చేయకుండా నా తల్లిదండ్రులను దృష్టిలో పెట్టుకుని పరీక్ష చేయించుకున్నా. దురదృష్టవశాత్తూ పాజిటివ్ అని వచ్చింది. చాలా స్వల్ప లక్షణాలు ఉన్నాయి. సాధారణ జీవితంలో అలాంటివి మనం లెక్క చేయం. ఇప్పుడు నేను పూర్తిగా కరోనా నుంచి బయటపడ్డా. ఆరోగ్యంగా ఉన్నా. ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు తీసుకుంటూ, జాగ్రత్తలు పాటిస్తూ, వ్యాధి నుంచి బయటపడ్డా. ఇదే విషయాన్ని మీకు చెప్పాలనుకున్నా. అయితే, ఇప్పుడు నేను బాలుగారి ఆరోగ్యం విషయంలో చాలా ఆందోళనగా ఉన్నా. నేను, నా కుటుంబం ఆయన కోలుకోవాలని ప్రార్థిస్తున్నాం. మనందరం ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుందాం. మీరందరూ కూడా సురక్షితంగా ఉండండి. దేన్నీ తేలికగా తీసుకోవద్దు. నాపై చూపిన, ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు" అని సునీత పేర్కొన్నారు.

మరోవైపు ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కూడా కరోనాతో పోరాడుతున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆయన అభిమానులు, శ్రేయోభిలాషులు యూనివర్సల్ మాస్ ప్రేయర్ చేశారు.



ప్రకృతి మాత ఒడిలో శంకర స్వరూపులు స్వరూపానందేంద్ర, అంతేవాసులు స్వాత్మానందేంద్ర. ఋషికేష్ వద్ద పవిత్ర గంగానదీ తీరాన తీసిన చిత్రం

# డిసెంబర్ నాటికి రూ.350 కోట్లు ఉపాధి హామీ ఖర్చు చేయాలి

- గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం
- యుద్ధ ప్రాతిపదికన పనులు నిర్వహించాలి
- ప్రణాళికాయుతంగా పారదర్శకంగా పనులు

జిల్లా కలెక్టర్ వి. వినయ్‌చంద్



విశాఖపట్నం : జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో డిసెంబర్ నాటికి రూ.350 కోట్లు ఖర్చు చేయాలని జిల్లా కలెక్టర్ వినయ్ చంద్ అధికారులను ఆదేశించారు.బుధవారం తన ఛాబర్ లో ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి పూర్తి చేయాలని, గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్ నెస్ కేంద్రాలు, అంగన్వాడి కేంద్రాల భవన నిర్మాణ కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశిం చారు.

ఇంజనీరింగ్ సిబ్బంది, మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికా రులు ఈ పనుల పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోజువారీ, ప్రతి వారం ప్రోగ్రెస్ ను తెలియజేస్తూ ఉండా లన్నారు. నియోజకవర్గం, మండలం వారీగా, డిఈ, ఈఈ ల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహించడం జరుగు తుందన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. పనులకు సంబంధించి మంజారి, నిర్మాణ సామగ్రి, మానవ వనరుల సమీకరణ మొదలైనవి ప్రణాళికాయుతంగా అమలు చేసినట్లయితే పనులు వేగంగా పూర్తవుతాయన్నారు.ఈ విషయమై 21వ తేదీన పూర్తి స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయితీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీరు సుధాకర్, డ్వామా పథక సంచాలకులు సందీప్ పాల్గొన్నారు.

# ‘రాజధాని అంశం మా పరిధిలోనిది కాదు’

## హైకోర్టుకు మరోసారి స్పష్టం చేసిన కేంద్రం




అమరావతి: పరిపాలనా వికేంద్రీకరణ, సీఆర్‌డీఏ చట్టం రద్దు విషయంలో హైకోర్టు జారీ చేసిన నోటీసులపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు ఉన్నత న్యాయస్థానంలో కేంద్రం మరోసారి కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. ఏపీ ప్రభుత్వం తీసుకున్న మూడు రాజధానుల ఏర్పాటు, సీఆర్‌డీఏ చట్టం రద్దు నిర్ణయాల అంశంలో దోనె సాంబశివరావు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తరఫున హోంశాఖ అండర్ సెక్రటరీ లలిత అఫిడవిట్ దాఖలు చేశారు. 2014 ఏప్రిల్ 23న అప్పటి ప్రభుత్వం అమరావతిని రాజధానిగా పేర్కొందని.. పునర్విభజన చట్టంలోని సెక్షన్ 94 ప్రకారం రాజధాని అభివృద్ధికి కేంద్రం నిధులు విడుదల చేసిందని అందులో తెలిపారు.

రాజధాని నిర్ణయించుకునే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి పాత్రలేదని.. తమ రాజధానులను నిర్ణయించుకునే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకే ఉందని కేంద్రం మరోసారి స్పష్టం చేసింది. రాష్ట్ర సమగ్ర ప్రాంతాల అభివృద్ధి 2020 చట్టం రూపకల్పన విషయాన్ని రాష్ట్రప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకురాలేదని అఫిడవిట్‌లో పేర్కొంది. చట్టాలు చేసుకునే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉంటుందని స్పష్టం చేసింది. ఈనెల 14న పేర్కొన్న అంశాలనే తాజాగా కేంద్రం పునరుద్ఘాటించింది.

# హెర్డ్ ఇమ్యూనిటీ పరిష్కారం కాదు : డబ్ల్యూహెచ్ఓ

## ప్రపంచదేశాలకు మరోసారి హెచ్చరిక

జెనీవా: కరోనా వైరస్ మహమ్మారిని నియంత్రించేందుకు హెర్డ్ ఇమ్యూనిటీ పరిష్కారం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరించింది. హెర్డ్ ఇమ్యూనిటీ సాధించడానికి అవసరమైన రోగనిరోధకతను పొందే వీలు దరిదాపుల్లో లేదని డబ్ల్యూహెచ్ఓ స్పష్టం చేసింది. హెర్డ్ ఇమ్యూనిటీపై వస్తున్న వార్తలను పూర్తిగా తోసిపుచ్చిన డబ్ల్యూహెచ్ఓ.. ఆ దిశగా అడుగులు వేయకూడదని ప్రపంచదేశాలకు సూచించింది.

వైరస్‌ను ఎదుర్కోవడంలో భాగంగా కేవలం వ్యాక్సిన్ ద్వారానే హెర్డ్ ఇమ్యూనిటీ సాధ్యమని ప్రపంచ ఆరోగ్యసంస్థ అత్యవసర విభాగాధిపతి మైక్ రేయాన్ స్పష్టం చేశారు. వైరస్ నియంత్రణకు అసలు సహజ హెర్డ్ ఇమ్యూనిటీ సిద్ధాంతం పరిష్కారమే కాదని స్పష్టం చేసిన ఆయన.. కేవలం 10 నుంచి 20శాతం మంది మాత్రమే యాంటీబాడీలు కలిగి ఉన్న నివేదికల సారాంశాన్ని నొక్కిచెప్పారు.

దాదాపు 70శాతం ప్రజలు వైరస్‌కులోనై వారిలో యాంటీబాడీలు వృద్ధిచెందడాన్ని హెర్డ్ ఇమ్యూనిటీ (మందగా రోగ నిరోధకశక్తి)గా పరిగణిస్తారు. సహజ రోగనిరోధక శక్తి ఎక్కువగా ఉండే యువత, మధ్య వయస్కులకు వైరస్ సోకేలా చేసి వారిద్వారా హెర్డ్ ఇమ్యూనిటీ లక్ష్యాన్ని సాధించాలనేది కొందరి వాదన.

అయితే, ఇది ప్రమాదకర పోకడ అని, ఈ వైరస్‌ల నియంత్రణను కేవలం వ్యాక్సినైజేషన్ ప్రక్రియ ద్వారా సాధించాలని డబ్ల్యూహెచ్ఓ స్పష్టం చేస్తోంది. ఇదిలాఉంటే, ప్రపంచవ్యాప్తంగా విజృంభిస్తోన్న కరోనావైరస్ ఇప్పటివరకు 2కోట్ల 20లక్షల మందిలో బయటపడింది. దీని బారినపడి ఇప్పటికే 7లక్షల 81వేల మంది ప్రాణాలు కోల్పోయారు.

# సమగ్ర భూ సర్వే త్వరితగతిన పూర్తి కావాలి

- అధికారులను ఆదేశించిన డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్
- కార్స్ టెక్నాలజీ పనితీరు స్వయంగా పరిశీలించిన ధర్మాన



అమరావతి : రాష్ట్రంలో చేపడుతున్న సమగ్ర భూసర్వే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన, ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్ అని, దీనిని ఆలస్యం చేయరాదని డిప్యూటీ సీఎం, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్ అధికారులను ఆదేశించారు. అమరావతిలోని తన క్యాంపు కార్యాలయంలో సంబంధిత అధికారులు నిర్వహించిన ‘డెమో’ను ఆయన స్వయంగా బుధవారం ఉదయం పరిశీలించారు. సమగ్ర భూ సర్వేకోసం వినియోగిస్తున్న కార్స్ నెట్‌వర్క్ పనితీరును ఆయన క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్మోహన్ రెడ్డి ఈ సమగ్ర భూసర్వే ప్రాజెక్టును మూడు విడతల్లో పూర్తి చేయాలని, అందుకు మండలాల వారీగా బృందాలు ఏర్పాటు చేయాలని, సర్వే రాళ్ల ఖర్చుకూడా ప్రభుత్వమే భరిస్తుందని ప్రకటించారని అధికారులకు స్పష్టం చేశారు. సర్వే వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరిచి, ఈ డిజిటల్ సమాచారాన్ని ఎన్‌క్రిప్ట్ చేస్తామని అధికారులు వివరించారు.



సమగ్ర సర్వే పూర్తయితే భూ విక్రయాలు, బదలాంపులు తేలిక అవుతాయని, రిజిస్ట్రేషన్ల ఆటో మ్యూటేషన్ జరుగుతుందని అధికారులు వెల్లడించారు. భూములపై యాజమాన్యపు హక్కులు కూడా సులువుగా మార్పు చేసే వీలుంటుందని రెవెన్యూ మంత్రికి అధికారులు వివరించారు.

# కార్మికులకు కరోనా బీమా వర్తింపజేస్తూ ఆదేశాలు

అమరావతి: ఏపీఎస్‌ఆర్టీసీ కార్మికులకు శుభవార్త. ఆర్టీసీ కార్మికులకు కరోనా బీమా వర్తింపజేయాలని యాజమాన్యం బుధవారం నిర్ణయం తీసుకుంది. కార్మిక పరిషత్ నేతలు నిన్న(మంగళవారం) ఏపీఎస్ ఆర్టీసీ ఎండీ కృష్ణబాబును కలిసి బీమా కల్పించాలంటూ కార్మికులు వినతి పత్రం అందజేసిన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన ఆర్టీసీ యాజమాన్యం కార్మికులకు 50 లక్షల రూపాయల కోవిడ్ బీమా వర్తింపచేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది.

అలాగే ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ ప్యాకేజిని ఆర్టీసీ కార్మికులకు కూడా వర్తింపజేస్తూ ఎండీ ఆదేశాలు జారీ చేయడంతో కార్మికులంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా కరోనాతో ఇప్పటివరకు మరణించిన 36 మంది ఆర్టీసీ కార్మికులకు కూడా ఈ బీమా వర్తింప చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం మృతుల వివరాలతో సహా ధ్రువపత్రాలను ఈ నెల 28లోపు ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి పంపాలని ఏండీ కృష్ణబాబు జిల్లాల ఆర్ఎంలను ఆదేశించారు. దీంతో కార్మిక పరిషత్ సహా ఇతర సంఘాల కార్మికులు ఎండీకి ధన్యవాదాలు తెలిపారు.



ఇటీవలే మాతృవియోగం చెందిన పురపాలక శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ ని విజయనగరం లో బొత్సా నివాసంలో కలిసి విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పరామర్శించారు. విషణ్ణ హృదయంతో తో ఉన్న బొత్సని పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఈ క్రమంలో ఆమె చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు.

# ఆస్తి, నీటి పన్నుల వసూళ్ల పై కమిషనర్ సమీక్ష

విశాఖపట్నం : మహావిశాఖపట్నం నగరపాలక సంస్థకు - 2020-21 మొదటి ఆర్థిక సంవత్సరానికిగాను చెల్లించవలసిన ఆస్తి, నీటి పన్నులు వసూళ్లపై బుధవారం రెవెన్యూ అధికారులు, ఇన్స్పెక్టర్లతో జి.వి.యం.సి కమీషనర్ డా. జి. సృజన జి.వి.యం.సి కౌన్సిల్ హాల్ నందు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో కమీషనరు మాట్లాడుతూ జోన్ల వారీగా ఆస్తి, నీటి పన్ను వసూళ్ళ వివరాలను సంబంధిత రెవిన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. 2019-20 సంవత్సరంలో ఆస్తి, నీటి పన్నుల వసూళ్ళకంటే ఇప్పటికి వసూలు చేసిన పన్నుల శాతం చాలా తక్కువగా ఉందన్నారు. జి.వి.యం.సి. కి పన్నుల రూపేణా రావలసిన ఆదాయం సకాలంలో వసూలు చేయకపోతే ప్రజలకు అందించవలసిన మౌళిక సదుపాయాలు, అభివృద్ధి పనులకు ఆర్థిక ఇబ్బంది కలుగుతుందన్నారు. రాష్ట్రంలో అన్ని చోట్ల పన్నులు వసూలు జరుగుతుండగా, జి.వి.యం.సి. లో మాత్రమే ఎందుకు తక్కువ శాతం పన్నులు వసూలు జరుగుతున్నాయని సంభందించిన అధికారులను ఆరాతీసారు. పెద్ద మొత్తంలో చెల్లించవలసిన ఆస్తి పన్నుదారులు సకాలంలో పన్నులు చెల్లించక పోయినట్లయితే వారికి రెవిన్యూ రికవరీ చట్టం క్రింద జప్తు నోటీసులు జారీ చేయవలసినదిగాల సంభందిత రెవిన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే నీటి పన్ను చెల్లించని నీటి పన్ను దారులకు నీటి సరఫరాను నిలిపివేయ వలసినదిగా ఆదేశాలు జారీచేసారు. గత సంవత్సరం ఈ నెలలో వసూలయిన ఆస్తి, నీటి పన్నుల మొత్తం కంటే 1 శాతం ఎక్కువగానే 3 రోజులలో పన్నులు వసూళ్ళు చేయవలసినదిగా రెవిన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే ఈ ఆర్థిక సంవత్సరానికి ఆస్తి పన్ను దారులు చెల్లించవలసిన ఆస్తి, నీటి పన్నులు 50 నుండి 60 శాతం సెప్టెంబర్ నెల ఆఖరునాటికి వసూళ్ళు చేయవలసినదిగా సంబందిత



రెవిన్యూ సిబ్బందికి లక్ష్యాన్ని నిర్దేశించారు.

సచివాలయాల వారీగా ఆస్తి, నీటి, వాణిజ్య సంస్థల అస్సెస్ మెంట్ వివరాలు, అండర్ అస్సెస్ మెంట్ వివరాలు సెప్టెంబర్ మొదటి వారంలో తనకు సమర్పించేటట్లు చర్యలు చేపట్టాలని, పన్నుల వసూళ్లకు సంబందించిన మొబైల్ యాప్ లో అస్సెస్ మెంట్ వివరాలను త్వరగా నమోదుచేసి పూర్తి స్థాయిలో యాప్ ను అందుబాటులోకి తీసుకురావాలని రెవిన్యూ డిప్యూటీ కమీషనర్ కు సూచించారు. ఈ సమీక్షా కార్యక్రమములో రెవిన్యూ డిప్యూటీ కమీషనర్ M.V.D. ఫణిరామ్, రెవిన్యూ అధికారులు, ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ధవళేశ్వరం వద్ద తగ్గుముఖం పట్టిన గోదావరి వరద

తూర్పుగోదావరి : ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద గోదావరి వరద నీరు ఉధృతి స్వల్పంగా తగ్గుముఖం పడుతోంది. బ్యారేజ్ వద్ద వరద 17.7 అడుగులకు తగ్గింది. దావరి వరద తగ్గుముఖం పట్టడంతో ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద మూడో ప్రమాద హెచ్చరికను తొలగించారు. ప్రస్తుతం అధికారులు బ్యారేజ్ గేట్లు ఎత్తి 18 లక్షల 99వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు.ఇప్పటికే వరద నీటిలోనే 27 లంక గ్రామాలు మగ్గుతున్నాయి.

భద్రాచలంలో 44 అడుగులకు చేరి గోదావరి నీటి మట్టం ప్రవహిస్తోంది. భద్రాచలంలో వరద నీటిమట్టం తగ్గడంతో ఈ రోజు రాత్రికి మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అప్పనపల్లి బాలాజీ ఆలయంలోకి వరద నీరు ప్రవేశించింది. ఆంధ్ర అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన డొక్కా సీతమ్మ ఇంటిని వరద ముంచెత్తింది. కాగా రంపచోడవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దేవీపట్నం, తోయ్యరు, గొందురు వరద బాధితులకు ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే ధనలక్ష్మీ సందర్శించారు. అక్కడి భోజనం వసతిని గురించి ఆడిగి తెలుసుకున్నారు.

# ఏపీలో ఒక్కరోజులోనే 9,742 కరోనా కేసులు

అమరావతి: ఏపీలో కరోనా మహా విజృంభణ కొనసాగుతోంది. 24 గంటల వ్యవధిలో (నిన్న ఉదయం 9 గంటల నుంచి ఈరోజు ఉదయం 9 గంటల వరకు) 57,685 మందిని పరీక్షించగా 9,742 మందికి వైరస్ సోకినట్లు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో మొత్తం కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 3,16,003కి చేరినట్లు బులెటిన్‌లో పేర్కొంది.

గత 24 గంటల్లో రాష్ట్ర వ్యాప్తంగా 86 మంది కొవిడ్‌తో మృతిచెందినట్లు తెలిపింది. చిత్తూరులో 15, నెల్లూరు 15, అనంతపురంలో 8, గుంటూరులో 5, ప్రకాశం 6, శ్రీకాకుళం 6, తూర్పుగోదావరి 5, విశాఖపట్నం 5, విజయనగరం 5, పశ్చిమగోదావరి 5, కడప 4, కృష్ణా 3, కర్నూలులో ఇద్దరు మృత్యువాత పడినట్లు బులెటిన్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 30,19,296 పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించింది.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com